మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 13-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 253 Issue: 253

13 మార్చి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:29 సూర్యాస్తమయం - సా. 6:22 తిథి దశమి ఉ. 8:10 వరకు సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం పూర్వాషాఢ రా. 2:54 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం వ్యతిపాత ఉ. 10:23 వరకు కరణం వనిజ రా. 7:21 వరకు విష్టి ఉ. 8:13 వరకు వర్జ్యం ఉ. 11:15 నుండి మ. 1:00 వరకు దుర్ముహూర్తం ఉ. 8:51 నుండి ఉ. 9:39 వరకు మ. 12:49 నుండి మ. 1:36 వరకు రాహుకాలం ఉ. 10:56 నుండి మ. 12:25 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:53 వరకు గుళికాకాలం ఉ. 7:58 నుండి ఉ. 9:27 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:53 నుండి తె. 5:41 వరకు అమృత ఘడియలు రా. 9:45 నుండి రా. 11:30 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:02 నుండి మ. 12:49 వరకు

Published from Jagitial
Circulated to Telangana




# ప్రతీకారం తీర్చుకుంటా!

## యుద్ధంలో మరణాలకు బదులు తప్పదు

ఇరాన్ నూతన సుప్రీం నాయకుడిగా ఎన్నికైన తర్వాత మోజ్తాబా ఖమేనీ తొలిసారి ఒక బహిరంగ ప్రకటన చేశారు. అమెరికాపై ప్రతీకారం కోసం హర్మూజ్ జల సంధి మూసివేత, పశ్చిమాసియాలోని పొరుగు దేశాలపై దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇరాన్ అధికారిక టెలివిజన్ న్యూస్ యాంకర్ గురువారం ఖమేనీ ప్రకటనను చదివి వినిపించారు. ఆయన మాత్రం మీడియా ముందుకు రాలేదు.

**అదే స్థాయిలో నాశనం చేసి తీరుతాం**

**అమెరికా సైనిక స్థావరాలు మూసేయాలి**

**మూసేదాకా పొరుగుదేశాలపై దాడులు**

**హర్మూజ్ జలసంధి మూసే ఉంటుంది**

**ఇరాన్ కొత్త సుప్రీం మోజ్తాబా హెచ్చరికలు**

టెహ్రాన్: ఫిబ్రవరి 28న జరిగిన దాడిలో ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించగా.. మోజ్తాబా కూడా తీవ్రంగా గాయపడినట్టు, ఆయన పరిస్థితి విషమంగా ఉందని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. కానీ, తాజా ప్రకటన ఆయన ఆరోగ్యంపై జరుగుతున్న ప్రచారానికి తెరదించినట్టయ్యింది. ఈ ప్రాంతంలో -2 వ పేజీలో...



## భారత్ నౌకలు.. రైట్ రైట్!

**హర్మూజ్ నుంచి వెళ్లేందుకు ఇరాన్ అనుమతి**

టెహ్రాన్: ప్రపంచ ఇంధన సంక్షోభం వేళ భారత్‌కు భారీ ఊరట లభించినట్లు తెలుస్తోంది. భారత్ జెండాతో ఉన్న నౌకలు హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు ఇరాన్ అనుమతించినట్లు సమాచారం. విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్, ఇరాన్ విదేశాంగ తరువాయి 2 వ పేజీలో...

## అమెరికాకు నై నై!

**ఇరాన్ వ్యూహాత్మక దాడులు.. బాబ్ ఎల్-మందెల్ జలసంధిపై నజర్**

**అమెరికా తప్పు చేస్తే దాన్నీ మూసేస్తాం.. ఇరాన్ సైనికాధికారి తీవ్ర హెచ్చరికలు**

టెహ్రాన్: అమెరికా వ్యూహాత్మక తప్పు చేస్తే ప్రపంచంలోని మరో కీలక సముద్ర మార్గాన్ని కూడా నిలిపేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఇప్పటికే హర్మూజ్ జలసంధి దాదాపు మూసుకుపోయిన పరిస్థితుల్లో, ఇప్పుడు బాబ్ ఎల్-మండెబ్ జలసంధి కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇరాన్ సీనియర్ సైనిక అధికారి హెచ్చరించారు. ఇలా జరిగితే ప్రపంచ ఇంధన సరఫరాపై భారీ ప్రభావం పడే అవకాశం

## పెరిగిపోతుంది!

**బ్యారెల్ చమురు 200 డాలర్లు అవుద్ది: ఇరాన్**

టెహ్రాన్ : ఒక బ్యారెల్‌కు 200 డాలర్ల చొప్పున చెల్లించేందుకు ప్రపంచం సిద్ధంగా ఉండాలని గురువారం ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. 1970 తర్వాత చమురు షాక్‌ను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక నిల్వలను విడుదల చేయాలని అంతర్జాతీయ ఇంధన సంస్థ సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ తాజా హెచ్చరిక జారీ చేసింది. మరోవైపు హర్మూజ్‌లో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య దాడులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోకి అమెరికా మిత్ర దేశాల నౌకలు అడుగుపెడితే పేలిపోయేలా ఇరాన్ ఎక్కడికక్కడ 'నేవల్ మైన్స్' (సముద్రపు మందుపాతరలు) అమర్చడం గమనార్హం.




## తగ్గిపోతోంది!

**డాలర్‌కు 92.17 రూపాయలు**

ముంబై: అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ అధ్వాన్న స్థాయికి పడిపోయింది. పతనంలో మరో నూతన రికార్డ్‌ను చవి చూసింది. భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో గురువారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 92.17 మార్క్‌కు పతనమయ్యింది. ఫారెక్స్ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో ఉదయం 92.25 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 92.36 కనిష్టానికి పతనం కాగా.. తుదకు 16 పైసలు కోల్పోయి 92.17 వద్ద ముగిసింది.



## పెంచేశారు!

**పల్లెల్లో గ్యాస్ బుకింగ్ వ్యవధి 45 రోజులు**

న్యూఢిల్లీ: దేశంలో నెలకొన్న వంటగ్యాస్ (ఎల్పీజీ) కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్ మధ్య వ్యవధిని 45 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం 25 రోజుల నిబంధన కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు సిలిండర్ల బుకింగ్ మధ్య 25 రోజుల గ్యాప్ ఉండగా, ఇకపై ఈ తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,222 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,396 |

### విశ్వవాణి



ఫ్రాన్స్‌లోని సూపర్ మార్కెట్లలో అమ్ముడుపోని తినుబండారాలను కచ్చితంగా పేదలకు ఉచితంగా ఇచ్చేయాలని అక్కడి ప్రభుత్వం నిబంధన అమలు చేస్తోంది. తద్వారా ఆహార పదార్థాల వ్యర్థాలు తగ్గడమే కాకుండా, పేదల కడుపు నిండుతుందన్నది లక్ష్యం. ప్రపంచంలో ఇలాంటి నిబంధన తెచ్చిన తొలి దేశంగా ఫ్రాన్స్ నిలిచింది.



## కవితకు సీబీఐ పిలుపు

**16న విచారణకు హాజరు కావాలని సమన్లు**

**ఢిల్లీ మద్యం కేసులో కీలక పరిణామం**

హైదరాబాద్, మార్చి 12 (ఈవార్తలు): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసానికి గురువారం సీబీఐ అధికారులు వచ్చారు. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లిన సీబీఐ అధికారులు, ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరు కావాలని కోరుతూ ఆమెకు సమన్లు అందజేశారు. ఫిబ్రవరి 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మందిని డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. సీబీఐ మోపిన తరువాయి 2 వ పేజీలో...

## టీవీఎస్ ఈవీ స్కూటర్ రూ.49,999

ప్రముఖ 2-వీలర్ తయారీ కంపెనీ టీవీఎస్ మోటార్ తన ఎలక్ట్రిక్ 2 వీలర్ శ్రేణిని మరింత విస్తరించింది. గతేడాది ఆర్బిటర్ పేరుతో ఈ-స్కూటర్ లాంచ్ చేయగా ఈసారి ఆర్బిటర్ వీ1ను లాంచ్ చేసింది. ఈ వీ1 మోడల్ స్కూటర్ 1.8 కిలోవాట్ పర్ హవర్ బ్యాటరీ సామర్థ్యంతో వస్తోంది.

ముంబై: అలాగే వీ2 స్కూటర్ 3.1 కిలోవాట్ పర్ హవర్ బ్యాటరీ సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చింది. వినియోగదారులకు ఈ స్కూటర్లను అందుబాటు ధరలో ఉంచేందుకు కీలక నిర్ణయం -2 వ పేజీలో...






## హైదరాబాద్‌కు హాలీవుడ్ నెట్‌ఫ్లిక్స్‌కు స్వాగతం..

**నా కల నిజం కాబోతోంది**

**సంస్థకు పూర్తి సహకారాలు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

నెట్‌ఫ్లిక్స్ సంస్థను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ ఆఫీస్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుపుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. నెట్‌ఫ్లిక్స్ సంస్థకు హైదరాబాద్ నగరం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. అదే సమయంలో తమ ప్రభుత్వం కూడా అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో నెట్‌ఫ్లిక్స్ సంస్థ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ మన నగరానికి వచ్చినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనే ఉందని తాను గతంలోనే చెప్పానని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. నెట్‌ఫ్లిక్స్ రాకతో తన కల నిజం కాబోతుందని ఆనందం వ్యక్తం చేశారు.

హైదరాబాద్, మార్చి 12 (ఈవార్తలు): తాను బాల్యంలో ఉన్నప్పటి నుంచే తనకు సినిమాలు అంటే ఎంతో ఇష్టమని తెలిపిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ కార్యాలయాన్ని తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సినిమా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని.. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి సినిమాలను తీశారని పేర్కొన్నారు. మద్రాకు కేంద్రంగా ఉన్న సినిమా ఇండస్ట్రీని ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వర్ రావు.. హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కాలంతో పాటు సినీ ఇండస్ట్రీలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ సంస్థ తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు విశాలమైన ఆఫీస్ నిర్మించుకునేందుకు కావాల్సిన భూమిని.. కొత్తగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి తమ ప్రభుత్వం రెడీగా ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీకి నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను తీసుకురావాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలో ఉన్న 500 పెద్ద కంపెనీలను.. తెలంగాణకు తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడి పెడితే పూర్తి రక్షణ ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజూ మాట్లాడుతూ.. సృజనాత్మక సాంకేతికతలు, దృశ్య శ్రవ్య కథన రీతులు, డిజిటల్ వినోద రంగాలకు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

13.3.2026

మేషం: ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆరోగ్యసమస్యలు భాదిస్తాయి. బంధు మిత్రులతో మాట పట్టింపులుంటాయి. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. పుణ్య క్షేత్ర దర్శనం చేసుకుంటారు. వ్యాపారమున ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు.

వృషభం: చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. జీవిత భాగస్వామితో శుభకార్యాలలో పాల్గొంటారు. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందుతాయి.

మిధునం: ఆస్తి వివాదాలు తొలగి ఊరట చెందుతారు. వాహన వ్యాపారస్తులకు లాభాలు అందుకుంటారు. కీలక సమయంలో సన్నిహితులు సాయం అందుతుంది. కుటుంబ వాతావరణం ఆనందంగా ఉంటుంది. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది.

కర్కాటకం: చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఇంటా బయట జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

సింహం: బంధువులతో వివాదాలు కలుగుతాయి. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. నూతన రుణాలు చేస్తారు. దూర ప్రయాణం సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోమున అదనపు బాధ్యతలు విశ్రాంతి లేకుండా చేస్తాయి.

కన్య: చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగ యత్నాలు విజయం వరిస్తుంది. నూతన పరిచయాలు పెరుగుతాయి. స్నేహితుల నుండి ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు లాభాలు పొందుతారు.

తుల: కుటుంబ పెద్దల సహకారంతో కొన్ని పనులు పూర్తవుతాయి. దూర ప్రయాణాల వలన శారీరక శ్రమ కలుగుతుంది. బంధుమిత్రుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారాలు లాభాల బాట పట్టడం కష్టంగా మారుతుంది. వృత్తి ఉద్యోగాలలో శ్రమ అధికం ఫలితం తక్కువగా ఉంటుంది.

వృశ్చికం: నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలను పొందుతారు. ఇంటా బయటా ఆదరణ పెరుగుతుంది. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: ఉద్యోగుల విషయంలో అధికారుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. సోదరులతో వివాదాలు పెరుగుతాయి. వ్యాపారం నిరాశ కలిగిస్తాయి. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి.

మకరం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగ విషయమై అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి. దేవాలయ దర్శనం చేసుకుంటారు.

కుంభం: సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ సంబంధిత వివాదాల నుంచి బయటపడతారు. ఆకస్మిక ధన లాభం పొందుతారు. కీలక వ్యవహారాలలో అంచనాలు నిజమవుతాయి. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది.

మీనం: కీలక వ్యవహారాలు నిదానంగా పూర్తవుతాయి. చెయ్యను పనికి సన్నిహితుల నుండి నిందలు ఎదుర్కొంటారు. ప్రయాణాలు అకస్మాత్తుగా వాయిదా పడతాయి. వృధా ఖర్చులు చేస్తారు. నూతన వ్యాపారాలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

# ప్రతీకారం తీర్చుకుంటాం!

మొదటి పేజీ తరువాయి

అమెరికా సైనిక స్థావరాలు పనిచేస్తూనే ఉంటే దాడులు తప్పవని హెచ్చరికలు చేశారు. 'వీలైనంత త్వరగా ఆ స్థావరాలను మూసివేయాలని నేను సలహా ఇస్తున్నాను.. ఎందుకంటే అమెరికా భద్రత, శాంతిని స్థాపిస్తుందనే వాదన అబద్ధం తప్ప మరేమీ కాదని వారు ఇప్పటికే గ్రహించి ఉండాలి' అని అన్నారు. యుద్ధంలో మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా ప్రతిజ్ఞ చేశారు. తన శత్రువు నుంచి ఇరాన్ పరిహారం వసూలు చేస్తుందని చెప్పారు. అందుకు నిరాకరిస్తే వారి ఆస్తుల స్వాధీనం లేదా అదే స్థాయిలో నాశనం చేస్తుందని ఉద్ఘాటించారు. 'మా ప్రతీకారం కొంత వరకే తీరింది. కానీ మొత్తం పూర్తయ్యే వరకూ మా ప్రాధాన్యతలో ఇది ఒకటిగా ఉంటుంది' అని స్పష్టం చేశారు. ఇరాన్ ఎప్పటికీ వెనక్కి తగ్గదని, పూర్తి శక్తితో ప్రతిఘటిస్తుందని ఆయన తేల్చిచెప్పారు. దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీకి మాత్రమే కాకుండా యుద్ధంలో ప్రతి పౌరుడి మరణానికి ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటుందని శపథం చేశారు. తన తండ్రి మరణం గురించి మాట్లాడుతూ.. గొప్ప వ్యక్తిత్వం కలిగిన తన తండ్రి ఎల్లప్పుడూ సత్యాన్నే మాట్లాడేవారని అన్నారు. తాను కూడా ఆయన మార్గంలో కొనసాగుతానని వెల్లడించారు. 'ఆయన బలిదానం తర్వాత ఆయన పార్థివదేహాన్ని చూసే గౌరవం నాకు దక్కింది. చెక్కుచెదరకుండా బిగించి ఉన్న పిడికిలి దృఢ సంకల్పాన్ని చాటిచెప్పింది. అమరుల రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటాం' అని తెలిపారు. లెబనాన్, ఇరాక్, యెమెన్‌తో సహా పశ్చిమాసియాలోని తన మిత్ర సాయుధ సమూహాలకు మొజ్తాబా ఖమేనీ కృతజ్ఞతలు తెలిపారు.

### యుద్ధం ఆపాలంటే మూడు షరతులు: ఇరాన్ అధ్యక్షుడు

కాగా, మొజ్తాబా ప్రకటనకు ముందు.. అమెరికా, ఇజ్రాయెల్‌తో చేస్తోన్న యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ ముందుకువచ్చింది. కానీ మూడు షరతులు విధించింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పశ్చిమాసియా ప్రాంతంలో శాంతికి ఇరాన్ కట్టుబడి ఉంది. రష్యా, పాకిస్థాన్



నాయకులతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని పునరుద్ఘాటించాను. అమెరికా రగిల్చిన యుద్ధాన్ని ముగించేందుకు మా మూడు షరతులను అంగీకరించాలి. ఇరాన్ చట్టబద్ధ హక్కుల్ని గుర్తించాలి. నష్టపరిహారం చెల్లించాలి. భవిష్యత్తులో దురాక్రమణలు జరగకుండా పటిష్ఠమైన అంతర్జాతీయ హామీలు ఉండాలి' అని తెలిపారు.



# భారత్ నౌకలు.. రైట్ రైట్!

మొదటి పేజీ తరువాయి

మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఉపశమనం లభించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో పుష్పక్, పరిమళ్ పేరిట ఉన్న రెండు ఇండియన్ ట్యాంకర్లు హర్మూజ్ జలసంధిని దాటినట్లు పేర్కొన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కొంటున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి జైశంకర్-అరాగ్చీ మధ్య మూడుసార్లు చర్చలు జరిగాయి. మంగళవారం ఇద్దరి మధ్య జరిగిన ఫోన్‌కాల్ వాటిల్లో ఒకటి. హర్మూజ్ నుంచి ట్యాంకర్లు సురక్షితంగా గమ్యస్థానానికి చేరడంపై వారు ప్రధానంగా మాట్లాడుకున్నారు. ఇక, జైశంకర్ బుధవారం రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులు, ఐరోపా నేతలతోనూ మాట్లాడారు. వీరు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రస్తుత సంక్షోభ ప్రభావాన్ని చర్చించుకున్నారు. కాగా, లైబీరియా జెండాతో ఉన్న చమురు నౌక ముంబయి పోర్ట్‌కు చేరుకుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ భారత్ కెప్టెన్ హర్మూజ్ మీదుగా దానిని బుధవారం సురక్షితంగా తీసుకువచ్చారు. సౌదీ అరేబియాలోని రాస్ తనురా పోర్ట్‌లో అది చమురు లోడ్ చేసుకుంది. మార్చి ఒకటిన రాస్ తనురా నుంచి బయల్దేరింది.

## టీవీఎస్ ఈవీ స్కూటర్ రూ.49,999

మొదటి పేజీ తరువాయి

తీసుకుంది. ఇందులో భాగంగా బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ మోడల్‌ను లాంచ్ చేసింది. దీంతో దాదాపు సగం ధరకే ఎలక్ట్రిక్ స్కూటర్ సొంతం చేసుకునే వీలుంటుంది. టీవీఎస్ ఆర్బిటర్ వీ1 స్కూటర్‌ను కేవలం రూ. 49,999 (ఢిల్లీ ఎక్స్ షోరూమ్ ధర) కే సొంతం చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఈ బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ ప్లాన్ ధర నెలకురూ. 862 నుంచే మొదలవుతున్నట్లు తెలిపింది. ఒక వేళ బ్యాటరీతో పాటు స్కూటర్ కొనుగోలు చేసేందుకు రూ. 84,500 చెల్లించాల్సి ఉంటుంది. ఆర్బిటర్ వీ2 స్కూటర్ ధర రూ. 99,900 నుంచి మొదలవుతున్నట్లు కంపెనీ తెలిపింది. అంటే బ్యాటరీని అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. నెల నెలా బ్యాటరీ కోసం రెంట్ చెల్లించాలి.



# అమెరికాకు నై నై!

మొదటి పేజీ తరువాయి

ఉంది. అల్‌జజీరాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ఇరాన్ సైనిక అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా వ్యూహాత్మక తప్పు చేస్తే బాబ్ ఎల్-మందెబ్ జలసంధి పరిస్థితి కూడా హర్మూజ్ లాగే మారవచ్చని ఆయన హెచ్చరించారు. త్వరలోనే ఈ ప్రాంతం పెద్ద ప్రాంతీయ యుద్ధంలోకి వెళ్లే అవకాశం ఉందని కూడా అన్నారు. ఇప్పటికే ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలు బాగా తగ్గిపోయాయి. సాధారణంగా రోజుకు సగటు న 138 నౌకలు వెళ్లే ఈ మార్గంలో, ఒక రోజు లో కేవలం రెండు నౌకలు మాత్రమే ప్రయా ణించినట్లు సమాచారం. కాగా, బాబ్ ఎల్-మందెబ్ జలసంధి.. యెమెన్-జిబౌటి మధ్య ఉన్నది. ఈ సముద్ర మార్గం వెడల్పు కేవలం 26 కిలోమీటర్లు మాత్రమే. కానీ ప్రపంచ వ్యాపారానికి ఇది అత్యంత కీలకం. ప్రతి సంవత్సరం దాదాపు 20 వేల నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తాయి. రోజుకు సుమారు 6.2 మిలియన్ బారెళ్ల చమురు ఈ మార్గం ద్వారా రవాణా అవుతుంది. ఈ జలసంధి మూసుకుపోతే పర్షియన్ గల్ఫ్ నుంచి యూరప్‌కు వెళ్లే అత్యంత చిన్న సముద్ర మార్గం పూర్తిగా నిలిచిపోతుంది. అప్పుడు నౌకలు ఆఫ్రికా దక్షిణ భాగం చుట్టూ ప్రయాణించాల్సి వస్తుంది. దాంతో రెండు వారాల ఆలస్యం, భారీ అదనపు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం హర్మూజ్ మార్గం దాదాపు నిలిచిపోవడంతో గల్ఫ్ దేశాలు బాబ్ ఎల్-మందెబ్ మార్గంపైనే ఆధారపడుతున్నా యి. ఈ మార్గం కూడా మూసుకుపోతే ప్రపంచ చమురు సరఫరా తీవ్రంగా దెబ్బతిం టుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్‌కు మద్దతుగా ఉన్న యెమెన్ హౌతి దళాలు కూడా ఈ ప్రాంతంలో ప్రభావం చూపగలవు. 2023 నుంచి ఇప్పటివరకు రెడ్ సీ ప్రాంతంలో వందకు పైగా నౌకలపై దాడులు జరిగాయి. ఇప్పటివరకు ఈ యుద్ధంలో హౌతీలు పూర్తిగా రంగంలోకి దిగలేదు. కానీ అవసరమైతే ఎప్పుడైనా చర్యలకు సిద్ధమని హెచ్చరిస్తున్నారు. హర్మూజ్‌తో పాటు బాబ్ ఎల్-మందెబ్ కూడా మూసుకుపోతే ప్రపంచ చమురు సరఫరా గొలుసు పూర్తిగా కుదేలయ్యే ప్రమాదం ఉంది. మొత్తానికి మధ్యప్రాచ్యంలో పెరుగుతు న్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపే పరిస్థితి కనిపిస్తోంది.



## కవితకు సీబీఐ పిలుపు

మొదటి పేజీ తరువాయి

అభియోగాలు నిరాధారమని కోర్టు అప్పట్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ట్రయల్ కోర్టులో ఈడీ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించడంతో పాటు, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే సీబీఐ అధికారులు కవితకు సమన్లు అందించారు. ఈ అంశంపై కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'సీబీఐ అధికారులు నాకు నోటీసులు అందజేశారు. దీనిపై నా లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నాను. చట్టంపై నాకు నమ్మకం ఉంది. విచారణకు సంపూర్ణంగా సహకరిస్తాను' అని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌కు హాలీవుడ్

మొదటి పేజీ తరువాయి

కేంద్రంగా హైదరాబాద్ ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. వేగంగా విస్తరిస్తున్న మీడియా, వినోద రంగ మౌలిక సదుపాయాలతో.. ప్రతిభకూ, ఆవిష్కరణలకూ శక్తిమంతమైన కేంద్రంగా ఈ నగరం నిలిచిందని వ్యాఖ్యానించారు. అద్భుతమైన కథన వారసత్వం భారత్‌కు ఉందనీ, సాంకేతిక పురోగతి వల్ల కథన తీరుతెన్నులూ, వేదికల్లో వేగంగా మార్పులొస్తున్నాయని తెలిపారు. వినోదం నేడు కళ, సాంకేతికతల సమ్మేళనంగా మారిందని, ఐలైన్ స్టూడియోస్ వంటి కార్యక్రమాలు భవిష్యత్ కథన రీతులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. దక్షిణాసియాలో అత్యంత ముఖ్యమైన కేంద్రంగా ఐలైన్ స్టూడియోస్ సేవలందిస్తుందని, అలాగే దృశ్య శ్రవణ, వినోద రంగాల్లో సరికొత్త అవకాశాలను అందిస్తుందని వివరించారు.

## తగ్గిపోతోంది!

మొదటి పేజీ తరువాయి

పశ్చిమాసియాలో ఆందోళనలతో ఇప్పటికే దిగుమతులు భారం కాగా.. రూపాయి పతనం మరింత ఆందోళన కలిగిస్తోంది. రూపాయి విలువ క్షీణించడం ద్వారా దిగుమతి చెల్లింపులు మరింత భారం కానున్నాయి.

## పెంచేశారు!

మొదటి పేజీ తరువాయి

నిబంధన కేవలం పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు మాత్రం ఒక సిలిండర్ బుక్ చేశాక, తదుపరి సిలిండర్ బుకింగ్ కోసం 45 రోజులు ఆగాల్సి ఉంటుంది. ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్ కొరత తీవ్రమైంది. దీంతో చాలామంది వినియోగదారులు ముందుజాగ్రత్తగా సిలిండర్లను బ్లాక్‌లో నిల్వ చేసుకోవడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్ సహా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి డిమాండ్ పెరగడంతో కమర్షియల్ సిలిండర్లను ఏజెన్సీలు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించి, అందరికీ గ్యాస్ అందుబాటులో ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది.



## బర్కత్‌పుర అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

హైదరాబాద్, మార్చి 12 (ఈవార్తలు): జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా గురువారం బర్కత్ పుర విక్రమ్ నగర్ లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుమ్మడి క్రాంతి ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శేఖర్, కార్తీక్, ఓంకార్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



### నరసింహునిపేటలో
## కేంద్ర బృందం పర్యటన

పెగడపల్లి, మార్చి 12 (ఈవార్తలు): జాతీయ పంచాయతీ అవార్డ్స్ 2023-24కి గానూ పేదరిక నిర్మూలన, జీవనోపాదుల పెంపు కేటగిరీలో జాతీయ అవార్డుకు జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నరసింహునిపేట గ్రామం నామినేట్ అయ్యింది. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం గ్రామంలో పర్యటించింది. గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, ప్రజలతో కేంద్ర సభ్యులు మాట్లాడారు. అనంతరం వారు గ్రామంలోని కార్యాలయాలు, రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డీపీవో మదన్ మోహన్, ఎంపీడీవో శశి కుమార్ రెడ్డి, సర్పంచ్ రాజమణి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం

**జగిత్యాలలో 22 గ్యాస్ సిలిండర్ల సీజ్**

జగిత్యాల టౌన్, మార్చి 12 (ఈవార్తలు): జగిత్యాలలోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లలో పౌరసరఫరాల సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కొన్ని హోటళ్లలో అక్రమంగా డొమెస్టిక్ (గృహ వినియోగ) వంట గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నట్లు గుర్తించి, 22 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి జితిందర్ రిక్ష, పౌరసరఫరాల సిబ్బంది పాల్గొన్నారు. సబ్సిడీపై వచ్చే గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జితిందర్ హెచ్చరించారు.



## ప్రజల సొత్తు వైసీపీ

**కార్యకర్త కాలర్ ఎగరేసేలా పార్టీ భవిష్యత్తు.. వైఎస్ జగన్ భావోద్వేగం**

తాడేపల్లి, మార్చి 12 (ఈవార్తలు): 2021 మార్చి 12న ఆవిర్భవించిన వైసీపీ... 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వేడుకలు మిన్నంటాయి. ఈరోజు జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కార్యక్రమంలో పార్టీ అధినేత జగన్ వైసీపీ జెండాను ఆవిష్కరించి, కార్యకర్తలను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. పార్టీ భవిష్యత్తుపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. నల్లకాల్వలో ఇచ్చిన మాట కోసమే ఈ పార్టీ పుట్టిందని జగన్ గుర్తుచేశారు. తాను ఇచ్చిన ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశను, దిశను మార్చివేసిందని ఆయన అన్నారు. 2011 మార్చి 12న పార్టీ ఆవిర్భవించిందని... వైసీపీ అనేది కోట్లాది మంది ప్రజల సొత్తు అని, మొదటి నుంచి తాను కేవలం ప్రజలను, దేవుడిని మాత్రమే నమ్ముకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు వైసీపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. వైసీపీ అభిమాని కాలర్ ఎగరేసేలా పార్టీ భవిష్యత్తు ఉంటుందని ఆయన కార్యకర్తల్లో ధైర్యం నింపారు. తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న ప్రతి గుండెకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వైఎసీపీ శ్రేణులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. 2011లో స్థాపించబడిన ఈ పార్టీ, 2019లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు, ఎక్స్ వేదికగా కూడా ఆయన భావోద్వేగపూరితమైన పోస్ట్ పెట్టారు. "నా ధైర్యం మీరే.. నా బలం మీరే. నాన్న గారి ఆశయ సాధన కోసం స్థాపించిన మన పార్టీని, నన్ను మీరు గుండెల్లో పెట్టుకున్నారు, భుజాలపై మోస్తున్నారు. కష్టకాలంలో వెనక్కి తగ్గకుండా పార్టీ కోసం నిలబడుతున్నారు. పార్టీపై నమ్మకం పెట్టుకుని, నాపై నమ్మకం ఉంచి పార్టీ కోసం నిలిచిన మీరే మన పార్టీకి అసలైన బలం.. నా బలం. మన పార్టీ ప్రస్థానం కేవలం ఒక రాజకీయ ప్రయాణం మాత్రమే కాదు. ఒక లక్ష్యంతో లక్షలాది మంది కార్యకర్తల కష్టం, నమ్మకం, త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం. వైసీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు పేరు పేరునా శుభాకాంక్షలు" అని ట్వీట్ చేశారు.

### ఎన్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా
## గవ్వల భరత్ కుమార్

**యువతను రాజకీయాల్లోకి రావాలి: మేఘాలయ సీఎం సంగ్మా**

హైదరాబాద్, మార్చి 12 (ఈవార్తలు): నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్‌ను పార్టీ జాతీయ నాయకత్వం నియమించింది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేయడంలో గవ్వల భరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తారని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. గవ్వల భరత్ కుమార్ గతంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అలాగే బీసీ యువజన సంఘం, బీసీ విద్యార్థి సంఘాల్లో నాయకత్వం వహిస్తూ బీసీ వర్గాల హక్కుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. యువత సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పలు ఉద్యమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన నేషనల్ పీపుల్స్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మేఘాలయ ముఖ్యమంత్రి కొంగ్రాడ్ సంగ్మా, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు జేమ్స్ సంగ్మా, జాతీయ ప్రధాన కార్యదర్శి పక్కా బాగే, జాతీయ యువజన సంఘం అధ్యక్షులు నీఖా నంక్ల తదితర నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన తెలిపారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతామని, ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని గవ్వల భరత్ కుమార్ పేర్కొన్నారు. ఈ నియామకంతో తెలంగాణలో నేషనల్ పీపుల్స్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.



### భార్య వేధింపులు తాళలేక
## భర్త ఆత్మహత్య

నేరేడ్‌మెట్-హైదరాబాద్, మార్చి 12 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్(41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్ గ్రూప్స్ పరీక్షలకు ప్రీపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేకపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై నిన్న రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ భార్య జ్యోతి సహా మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కంటికి రెప్పలా మత్స్యకారులు

**ఆ బాధ్యత మాది: లోకేశ్**



నెల్లూరు, మార్చి 12 (ఈవార్తలు: ఆంధ్రప్రదేశ్‌ను మారిటైమ్ ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ రంగంలో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రాష్ట్రంలో దేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించనున్న అటానమస్ మారిటైమ్ షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, ఇది కేవలం ఒక పరిశ్రమ ప్రారంభోత్సవం కాదని, భారతదేశ సముద్ర సాంకేతిక భవిష్యత్తుకు నాంది అని అభివర్ణించారు. దేశంలోనే రెండవ అతిపెద్ద తీరరేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్‌కు సముద్రం జీవనోపాధి, వాణిజ్యం, సంస్కృతికి కేంద్రమని మంత్రి పేర్కొన్నారు. "లక్షలాది మత్స్యకార కుటుంబాలు సముద్రంపై ఆధారపడి జీవిస్తున్నాయి. వారి భద్రత, జీవనోపాధిని మెరుగుపరిచేందుకు సాంకేతికతను వినియోగించడం అత్యంత ముఖ్యం. ఈ రోజు ప్రారంభమవుతున్న ప్రాజెక్ట్ ఆ లక్ష్యాన్ని నెరవేరుస్తుంది" అని లోకేశ్ తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పక్కనే 29.58 ఎకరాల విస్తీర్ణంలో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మిస్తోందని లోకేశ్ వెల్లడించారు. ఈ కేంద్రంలో మనుషులు లేని సముద్ర నౌకలు (అటానమస్ షిప్స్), అండర్ వాటర్ వెహికల్స్, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు వంటి అత్యాధునిక సాంకేతికతలను అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఇవి తీరప్రాంత భద్రత, విపత్తు నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ ప్రాజెక్టుపై మత్స్యకార సోదరులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. "ఈ టెక్నాలజీ దేశ రక్షణకే కాదు, మీ జీవితాలను మెరుగుపరచడానికి కూడా ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో మీకు రియల్ టైం వాతావరణ సమాచారం, చేపల గుంపులను గుర్తించడం, నావిగేషన్ సహాయం అందిస్తుంది. దీనివల్ల మీ భద్రత పెరిగి, ఇంధన వ్యయం తగ్గి, ఉత్పాదకత పెరుగుతుంది. మత్స్యకారులను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది" అని హామీ ఇచ్చారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, సాగర్ డిఫెన్స్ సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగులకు
## ఏపీ సర్కార్ వరాలు

**2 నెలల పితృత్వ సెలవులు, ఐవీఎఫ్ రాయితీ**

అమరావతి, మార్చి 12 (ఈవార్తలు): ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం, జనాభా నియంత్రణ విధానాలపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో తగ్గుతున్న జనాభా వృద్ధి రేటును పెంచే లక్ష్యంతో మూడో సంతానం పొందిన పురుష ఉద్యోగులకు ప్రయోగాత్మకంగా రెండు నెలల పాటు పితృత్వ సెలవులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఈ వివరాలు వెల్లడించారు. పిల్లల సంరక్షణలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం కూడా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. 50 మందికి పైగా మహిళా సిబ్బంది ఉన్న కార్యాలయాల్లో తప్పనిసరిగా చైల్డ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళల కోసం పింక్ టాయిలెట్లు, షీ క్యాబ్స్ సేవలను మరింత విస్తృతం చేయనున్నారు. దీనికి తోడు రూ.172 కోట్ల వ్యయంతో 23 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. ఒక్క విశాఖపట్నంలోనే మూడు హాస్టళ్లను నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి లక్ష పట్టణ జనాభాకు కనీసం ఒక వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఉండేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరుడి అరెస్ట్

విజయవాడ, మార్చి 12 (ఈవార్తలు): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు కర్నాటి వీరభద్రరావును విజయవాడ పటమట పోలీసులు ఈరోజు అరెస్టు చేశారు. ఏపీ హైకోర్టు అడ్వకేట్‌ను కిడ్నాప్ చేసి, నిర్బంధించి హింసించినట్లు నమోదైన కేసులో వీరభద్రరావును ఏ-1గా పోలీసులు చేర్చారు. కేసు వివరాల్లోకి వెళితే... 2023 నవంబర్ 7వ తేదీన హైకోర్టు అడ్వకేట్‌ను అక్రమంగా నిర్బంధించి, తీవ్రంగా హింసించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనపై దొంగ కేసులు పెట్టి, కిడ్నాప్ చేసి, ప్రాణభయం చూపించి బలవంతంగా ఆస్తులు రాయించుకున్నారని సదరు అడ్వకేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కిడ్నాప్ ఉదంతంలో అప్పటి డీఎస్పీ పల్లంరాజు, ఎస్ఐ రబ్బానీ నిందితులకు సహకరించినట్లు విచారణలో తేలింది. వీరు ఇప్పటికే శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌లో ఉన్నారు. ఈ కేసులో కర్నాటి వీరభద్రరావుతో పాటు కర్నాటి సతీశ్‌లపై కూడా తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. వీరిద్దరూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అత్యంత సన్నిహితులుగా పేరు పొందారు. వీరభద్రరావు అరెస్టుతో ఈ కేసులో కీలక పురోగతి లభించినట్లయింది. మరో నిందితుడు కర్నాటి సతీశ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసులో విజయవాడ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## పన్నుల వసూళ్లలో ఏఐ వినియోగం: చంద్రబాబు

అమరావతి, మార్చి 12 (ఈవార్తలు): ఏపీలో పన్ను ఎగవేతలను నిరోధించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ చేపట్టాలని, ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో కొనసాగుతున్న ఆరో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆయన ఆదాయార్జన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పన్ను ఎగవేతలపై కఠినంగా వ్యవహరించాలని, అయితే పన్ను చెల్లింపుదారులను అనవసరంగా వేధించవద్దని స్పష్టం చేశారు. కొందరు కాంట్రాక్టర్లు తమ కార్యాలయాలను పొరుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకొని, ఆంధ్రప్రదేశ్‌లో పనులు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఇతర ప్రాజెక్టుల పనులు చేస్తున్నప్పటికీ, వారి నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లు, వర్క్ ఆర్డర్లలో ఉన్న కాంట్రాక్టర్ల నుంచి ఆదాయం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు మన రాష్ట్ర ఖజానాకే చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గట్టిగా చెప్పారు. "పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి నమోదైతేనే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది. ప్రతి రంగంలోనూ వృద్ధి సాధించడం ద్వారా నిర్దేశిత జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. పన్ను ఎగవేతలకు పాల్పడి ఎవరూ తప్పించుకోవడానికి వీల్లేదని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పన్ను వసూళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తూనే, నిజాయితీపరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.



**వడగాలులపై జాగ్రత్త**

ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వడగాలుల కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకూడదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. అమరావతిలో రెండో రోజు కొనసాగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో ఆయన వైద్యారోగ్యం, వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. వైద్యారోగ్య రంగంపైనా సీఎం పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

## చంద్రన్న తోఫా ఎక్కడ?: షర్మిల

విజయవాడ, మార్చి 12 (ఈవార్తలు: ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులు బాగానే ఉన్నాయని, కానీ పేద ముస్లింలకు ఇస్తానన్న 'రంజాన్ తోఫా' సంగతేంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు" అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.



### కూల్‌డ్రింక్ అనుకొని..
## పురుగుల మందు తాగి చిన్నారి మృతి


**ఏపీలోని ఏలూరు జిల్లాలో ఘోర విషాదం**

ఏలూరు, మార్చి 12 (ఈవార్తలు): ఏపీలోని ఏలూరు జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. భర్తను బెదిరించేందుకు ఓ తల్లి కూల్‌డ్రింక్ బాటిల్‌లో తెచ్చిన పురుగుల మందును.. ఐదేళ్ల కుమార్తె నిజంగానే కూల్‌డ్రింక్ అనుకుని తాగేసి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం మర్రిగూడేనికి చెందిన పూనెం నాగేంద్రబాబుకు, అందర్వేదిగూడేనికి చెందిన కుమారికి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఐదేళ్ల కుమార్తె రితిక ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తను భయపెట్టి దారికి తెచ్చుకోవాలని భావించిన కుమారి, పొగాకు తోటలకు కొట్టే జిడ్డు మందును ఓ కూల్‌డ్రింక్ సీసాలో నింపి ఇంటి దగ్గరున్న కంచె వద్ద పెట్టింది. మంగళవారం ఆ బాటిల్‌ను గమనించిన చిన్నారి రితిక, అందులో ఉన్నది కూల్‌డ్రింక్ అని భ్రమపడింది. ఎవరూ చూడని సమయంలో దాన్ని తాగేసింది. కొద్దిసేపటికే తీవ్రమైన కడుపునొప్పితో విలవిల్లాడటంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం రితిక మృతి చెందింది. తల్లి క్షణికావేశంలో చేసిన పనికి పసిపాప ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# భారత్‌కు ఇంధన సంక్షోభం

**గ్యాస్ కొరతతో అల్లాడుతున్న దేశం.. తప్పుడు విదేశాంగ విధానాలే కారణం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు**






న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దేశ ఇంధన భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాల కారణంగా దేశం త్వరలో గ్యాస్, పెట్రోల్ వంటి ఇంధనాల విషయంలో తీవ్ర సవాళ్లు ఎదుర్కోబోతోందని హెచ్చరించారు. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది... ఇది ప్రారంభం మాత్రమే అని అన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తగిన ఏర్పాట్లు చేయాలని గురువారం డిమాండ్ చేశారు. పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, దేశంలో నెలకొన్న గ్యాస్, ఎల్పీజీ పరిస్థితిపై సభలో మాట్లాడేందుకు తాను ప్రయత్నించగా, తనకు అనుమతి లభించలేదని తెలిపారు. "సాధారణంగా సభలో మాట్లాడటానికి ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇప్పుడు కొత్త విధానం మొదలైనట్లుంది. నేను మాట్లాడాలనుకున్న అంశంపై ముందు మంత్రి నిర్ణయిస్తారు, ఆ తర్వాతే నేను మాట్లాడాలి. మళ్ళీ ఆ తర్వాత మంత్రి స్పందిస్తారు. ఈ కొత్త పద్ధతి ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రోల్, అన్ని రకాల ఇంధనాలు పెద్ద సమస్యగా మారనున్నాయి. ఎందుకంటే మన ఇంధన భద్రత దెబ్బతింది. ప్రభుత్వ లోపభూయిష్ట విదేశాంగ విధానం ఈ సమస్యను సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ మేల్కొని సన్నాహాలు ప్రారంభించాలి. లేకపోతే కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు" అని స్పష్టం చేశారు. ఈ సమస్య కేవలం ఇరాన్ వంటి దేశాలు ఇంధన సరఫరాను అనుమతిస్తాయా లేదా అనేదాని కంటే చాలా పెద్దదని రాహుల్ అన్నారు. "మనం ఒక అస్థిరమైన కాలంలోకి అడుగుపెడుతున్నాం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని తెలిపారు. తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని, రాబోయే పెను ప్రమాదం గురించి కేవలం హెచ్చరిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "ఇది రాజకీయ ప్రకటన కాదు. నా కళ్లకు ఓ పెద్ద సమస్య కనిపిస్తోంది. ప్రపంచం మారుతోంది, దాని నిర్మాణం కూడా మారుతోంది. కాబట్టి మనం కూడా మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్పష్టతతో పనిచేయకపోతే, మారుతున్న ప్రపంచంలో భారత్‌ను 'కేంద్రంగా' నిలపకపోతే సమస్యలు తప్పవు" అని ఆయన పేర్కొన్నారు.



## ముంబైలో ఊపిరి ఆడటం లేదు

**పిల్లలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు**

**బీఎంసీపై దీపిక పదుకొణె ఫైర్**

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో నానాటికీ పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణలో మహారాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందంటూ సోషల్ మీడియా వేదికగా అధికారుల తీరును ఆమె సూటిగా ప్రశ్నించారు. గురువారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ముంబై నగర వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) డేటాను దీపిక షేర్ చేశారు. నగరం సగటు ఏక్యూఐ 150గా ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేస్తూ, "ఈ నగరం, ఇక్కడి పిల్లలు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు! ఇది ఎలా సమర్థనీయం!? దయచేసి సహాయం చేయండి" అని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ), దాని ఆరోగ్య విభాగాన్ని ట్యాగ్ చేశారు. 2024 సెప్టెంబరులో రణ్‌వీర్ సింగ్‌తో తనకు కుమార్తె 'దువా' జన్మించడంతో, ఒక తల్లిగా కూడా దీపిక ఈ అంశంపై గట్టిగా స్పందించారు. గత ఏడాదిగా ముంబైలో వాయు నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నగరవ్యాప్తంగా ఏక్యూఐ 230-250 మధ్య నమోదవగా, బీకేసీ, ఘాట్‌కోపర్, ములుండ్ వంటి ప్రాంతాల్లో 290కి చేరింది. నగరంలో పెద్ద ఎత్తున జరుగుతున్న మౌలిక సదుపాయాలు, ఇతర నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వెలువడుతున్న ధూళి కాలుష్యానికి ప్రధాన కారణంగా మారింది. తవ్వకాలు, శిథిలాల రవాణా వల్ల గాలిలో పీఎం10, పీఎం2.5 ధూళి కణాలు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. నిబంధనలు పాటించని నిర్మాణాలే కాలుష్యానికి కారణమని అధికారులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో, కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకొని 1000కి పైగా నిర్మాణ ప్రాజెక్టులకు బీఎంసీ స్టాప్-వర్క్ నోటీసులు జారీ చేసింది. మరోవైపు, కాలుష్య నియంత్రణలో అధికారుల వైఫల్యంపై బాంబే హైకోర్టు సైతం పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసింది.

## ఎన్నారైలకు ఉచిత సైకలాజికల్ థెరపీ

**యుద్ధంతో గల్ఫ్ ప్రవాసుల్లో తీవ్ర ఆందోళన.. కేరళకు చెందిన 'ఒప్పం' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ చొరవ**




దుబాయ్: పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాల్లో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు గల్ఫ్ దేశాల్లోని ప్రవాస భారతీయులలో తీవ్ర ఆందోళన నింపుతున్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో మానసిక ఒత్తిడికి గురవుతున్న వారికి అండగా నిలిచేందుకు కేరళకు చెందిన ఒక ఆన్‌లైన్ మెంటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్ ముందుకొచ్చింది. మధ్యప్రాచ్య దేశాలలో నివసిస్తున్న మలయాళ, తమిళ ప్రవాసులకు ఉచితంగా మానసిక మద్దతు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న వేలాది మంది భారతీయ ప్రవాసులలో భయాందోళనలు పెరుగుతున్నాయి. భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనడంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో, కేరళకు చెందిన 'ఒప్పం' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్, భయం, ఆందోళన లేదా ఇతర మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి తక్షణ సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ ఉచిత థెరపీ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ సేవలు పొందాలనుకునే వారు 'ఒప్పం' వెబ్‌సైట్ ద్వారా ఉచిత థెరపీ సెషన్‌ను బుక్ చేసుకోవచ్చు లేదా వారి హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చు. ఈ సెషన్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతాయని, సహాయం కోరే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఎక్కడి నుంచైనా సులభంగా మానసిక నిపుణుల సహాయం పొందేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. కాసర్‌గోడ్‌కు చెందిన ఇబ్రహీం హవాజ్, అబ్దుల్లా కున్హి, ముబషిరా కలిసి 2023లో 'ఒప్పం' ప్లాట్‌ఫామ్‌ను కేరళలో ప్రారంభించారు. మాతృభాషలో మానసిక ఆరోగ్య సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే దీని ముఖ్య ఉద్దేశం. చాలా మంది ప్రవాసులు సామాజిక అపోహలు, అవగాహన లోపం లేదా తమకు తెలిసిన భాషలో నిపుణులు అందుబాటులో లేకపోవడం వల్ల మానసిక సహాయం తీసుకోవడానికి వెనుకాడతారని వ్యవస్థాపకులు వివరించారు. ఈ అంతరాన్ని పూడ్చడానికే తాము మాతృభాషలో సేవలు అందిస్తున్నామని తెలిపారు.



## మీరు ప్రేమిస్తే బెంగాల్ ప్రేమిస్తుంది

**కొత్త గవర్నర్‌కు మమతా కీలక సందేశం**

**22వ గవర్నర్‌గా ఆర్ఎన్ రవి ప్రమాణం**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ 22వ గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆయనతో తొలిసారి సంభాషిస్తూ ఒక కీలక సందేశాన్ని ఇచ్చారు. "మీరు బెంగాల్‌ను ప్రేమిస్తే, బెంగాల్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తుంది" అని ఆమె రవికి సూచనప్రాయంగా తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిశాక, మమతా బెనర్జీ కొత్త గవర్నర్‌కు మెడలో శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "బెంగాల్‌లో అన్ని భాషల ప్రజలు కలిసిమెలిసి శాంతియుతంగా ఉంటారు. కానీ, బెంగాల్‌ను ప్రేమించే వారిని బెంగాలీలు కూడా ప్రేమిస్తారన్నది ముఖ్యం. ఇది బెంగాలీల నైజం" అని వివరించారు. దీనికి గవర్నర్ రవి స్పందిస్తూ.. "పశ్చిమ బెంగాల్ దేశానికి మేధో, సాంస్కృతిక రాజధాని అనేది నిజం" అని అన్నారు. మమత చేసిన ఈ వ్యాఖ్యల వెనుక బలమైన రాజకీయ సందేశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా రాజ్ భవన్ నుంచి ఎలాంటి చర్యలు ఉండకూడదనేది ఆ సందేశం సారాంశం అని విశ్లేషిస్తున్నారు. గతంలో గవర్నర్‌గా పనిచేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ (ప్రస్తుత ఉపరాష్ట్రపతి), ఆ తర్వాత వచ్చిన సి.వి. ఆనంద బోస్‌ల హయాంలోనూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్ భవన్‌కు మధ్య తీవ్రమైన ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మమత వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## మనోళ్లను ప్రపంచం పిలుస్తోంది!

**మన నిపుణులకు విదేశాల్లో డిమాండ్**

న్యూఢిల్లీ: గ్లోబల్ డిజిటల్ వర్క్‌ఫోర్స్‌లో భారత్ తన పాత్రను వేగంగా విస్తరించుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా విదేశీ నియామకాలు జరిపే దేశాల్లో భారత్ మూడో అతిపెద్ద దేశంగా నిలిచింది. అంతేకాకుండా, ప్రపంచంలోని మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ట్రైనర్లలో 7.2 శాతం వాటాతో కీలక శక్తిగా ఎదుగుతోందని ఓ నివేదిక వెల్లడించింది. డీల్ అనే సంస్థ గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం, ప్రపంచంలో అత్యంత అధిక ప్రతిభా వనరులు కలిగిన దేశాల్లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ విషయంలో ఫిలిప్పీన్స్, కెనడా వంటి దేశాలను భారత్ అధిగమించింది. గ్లోబల్ లేబర్ మార్కెట్‌లో వస్తున్న మార్పులను ఈ నివేదిక హైలైట్ చేసింది. ముఖ్యంగా ఏఐ ట్రైనింగ్ ఒక కొత్త వృత్తిగా ఆవిర్భవించడం, ప్రత్యేక నైపుణ్యాల కోసం స్టార్టప్‌లు అంతర్జాతీయ నియామకాలు చేపట్టడం వంటి అంశాలను ప్రస్తావించింది. భారతీయ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే, అమెరికా నుంచి భారత్‌లో నియామకాలు 24 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి 64 శాతం, ఆస్ట్రేలియా నుంచి 61.5 శాతం పెరిగాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్, యూజర్ ఇంటర్‌ఫేస్ వంటి ఉద్యోగాలకు బాగా డిమాండ్ ఉంది. ఈ నివేదికలో ఏఐ ట్రైనర్ల వృద్ధి మరో ముఖ్యమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా 600కు పైగా సంస్థల్లో సుమారు 70,000 మంది ఏఐ సిస్టమ్‌లకు శిక్షణ ఇస్తున్నారని తేలింది. సాధారణంగా గ్లోబల్ మార్కెట్‌లో ఏఐ ట్రైనర్లు గంటకు 15 నుంచి 20 డాలర్లు సంపాదిస్తుండగా, నిపుణులు గంటకు 50 నుంచి 100 డాలర్ల వరకు ఆర్జిస్తున్నారు. అయితే, భారత్‌లో ఏఐ ట్రైనర్ల సగటు వేతనం గంటకు 12 డాలర్లుగా ఉందని నివేదిక పేర్కొంది. ఇది గ్లోబల్ లేబర్ మార్కెట్లలోని వ్యత్యాసాలను సూచిస్తోంది.

## జీతం ఇవ్వలేదని గ్యాస్ సిలిండర్ల ట్రక్కు చోరీ




ఝాన్సీ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీలో ఇటీవల జరిగిన గ్యాస్ సిలిండర్ల ట్రక్కు అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. ఈ భారీ చోరీకి పాల్పడిన ఏడుగురు నిందితులను సిప్రి బజార్ పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ సంయుక్తంగా అరెస్ట్ చేశాయి. నిందితుల నుంచి చోరీకి గురైన మొత్తం 524 ఎల్పీజీ సిలిండర్లతో పాటు రూ.11.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఈ చోరీ వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ప్రధాన నిందితులైన జావేద్, రితిక్ గతంలో అదే ట్రక్కు యజమాని వద్ద డ్రైవర్లుగా పనిచేశారు. తమకు రావాల్సిన సుమారు 70 వేల రూపాయల జీతం బకాయిలను యజమాని ఇవ్వకపోవడంతో అతడిపై ప్రతీకారం తీర్చుకోవడానికే ఈ దొంగతనానికి ప్లాన్ చేసినట్లు నిందితులు అంగీకరించారు. మార్చి 2 నుంచి 6వ తేదీ మధ్యలో గ్యాస్ ప్లాంట్ బయట ఉన్న ట్రక్కును వీరు అపహరించారు. చోరీ చేసిన సిలిండర్లను నిందితులు ఝాన్సీకి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న సమతార్‌లోని 'శివ గ్యాస్ ఏజెన్సీ' యజమానికి రూ. 13 లక్షలకు విక్రయించారు. ఈ లావాదేవీలో భాగస్వాములైన ఏజెన్సీ యజమానిని, మరో ముగ్గురు వ్యక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 379 నిండుగా ఉన్న సిలిండర్లు, 135 ఖాళీ సిలిండర్లు ఉన్నాయి.

## యుద్ధానికి అమెరికా రూ.లక్ష కోట్ల ఖర్చు

పెంటగాన్: పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు అగ్రరాజ్యం అమెరికాకు చమటలు పట్టిస్తున్నాయి. గత 12 రోజులుగా ఇరాన్‌పై చేస్తున్న దాడులకు అమెరికా మంచినీళ్లలా డబ్బు ఖర్చు చేస్తోంది. యుద్ధం మొదలైన మొదటి ఆరు రోజుల్లోనే డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ఏకంగా 11.3 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. భారత కరెన్సీలో ఇది దాదాపు లక్ష కోట్ల రూపాయలకు పైమాటే. సెనేటర్లతో జరిగిన అంతర్గత సమావేశంలో రక్షణ శాఖ అధికారులు ఈ గణాంకాలను బయటపెట్టారు. గత నెల 28న యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే సుమారు 5.6 బిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక ఆయుధ సామగ్రిని అమెరికా ప్రయోగించింది. అయితే, క్షేత్రస్థాయిలో వాస్తవ ఖర్చు ఈ అంచనాల కంటే చాలా ఎక్కువగా ఉండొచ్చని సెనేటర్ క్రిస్ కూన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగే సూచనలు కనిపిస్తుండటంతో అదనపు నిధుల కోసం ట్రంప్ సర్కార్ వేట మొదలుపెట్టింది. త్వరలోనే మరో 50 బిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయించాలని కోరుతూ వైట్‌హౌస్ కాంగ్రెస్‌కు ప్రతిపాదనలు పంపనుంది. ఇప్పటికే అమెరికా రక్షణ శాఖ నిల్వలు నిండుకుంటున్నాయని, ప్రస్తుత యుద్ధం సైనిక శక్తిని మరింత కుంగదీస్తుందని కాంగ్రెస్ సభ్యులు హెచ్చరిస్తున్నారు.

## ఫరూక్ అబ్దుల్లాపై నాన్ బెయిలబుల్ వారెంట్

**వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్‌ను తిరస్కరణ**

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాకు శ్రీనగర్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) నిధుల దుర్వినియోగం కేసులో ఆయనపై గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ కేసు విచారణలో భాగంగా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఫరూక్ అబ్దుల్లా దాఖలు చేసిన పిటిషన్‌ను శ్రీనగర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. తక్షణమే ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను మార్చి 30వ తేదీకి వాయిదా వేసింది. జేకేసీఏలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఈ కేసులో నిందితులపై అభియోగాల నమోదు ప్రక్రియ కోసం గురువారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగానే న్యాయస్థానం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. జేకేసీఏ అధ్యక్షుడిగా ఫరూక్ అబ్దుల్లా ఉన్న సమయంలో క్రికెట్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించారని, భారీగా దుర్వినియోగం జరిగిందని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కుంభకోణంపై ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఫరూక్ అబ్దుల్లాతో పాటు పలువురిపై రణబీర్ పీనల్ కోడ్ (ఆర్పీసీ)లోని సెక్షన్ 120-బి (కుట్ర), 406 (విశ్వాసఘాతుకం), 409 (ప్రభుత్వ ఉద్యోగిగా నిధుల దుర్వినియోగం) కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఫరూక్ అబ్దుల్లాతో పాటు జేకేసీఏ మాజీ అధికారులు అహ్సన్ అహ్మద్ మీర్జా, మహ్మద్ సలీం ఖాన్, బషీర్ అహ్మద్ మిస్గర్‌లను కూడా సీబీఐ నిందితులుగా చేర్చింది. కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టినట్టు దర్యాప్తులో తేలిందని సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. చాలాకాలంగా కొనసాగుతున్న ఈ కేసులో, తాజా కోర్టు ఆదేశాలతో విచారణ ప్రక్రియ వేగవంతం కానుంది.

## దుబాయ్ డౌన్ టౌన్ పై డ్రోన్ దాడి

దుబాయ్: గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఉద్ధృతం చేస్తోంది. తాజాగా, దుబాయ్ సహా పలు గల్ఫ్ నగరాల్లో డ్రోన్ దాడులు, పేలుళ్లు సంభవించాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ప్రారంభించిన ఈ ప్రతిదాడులు ఇప్పుడు గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థను, భద్రతను కలవరపెడుతున్నాయి. దుబాయ్ డౌన్ టౌన్ లోని అల్ బదా నివాస ప్రాంతంలో డ్రోన్ పేలుడు జరిగినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ దాడితో ఆకాశంలో పొగ మేఘాలు కమ్ముకున్నాయి. అయితే ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని దుబాయ్ మీడియా తెలిపింది. మరోవైపు దుబాయ్ క్రీక్ హార్బర్ ప్రాంతంలోని ఓ భవనాన్ని ఈ తెల్లవారుజామున ఒక డ్రోన్ ఢీకొట్టింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. దుబాయ్ తీరంలో ప్రయాణిస్తున్న ఒక కంటైనర్ షిప్ పై గుర్తుతెలియని క్షిపణి దాడి జరగడంతో స్వల్పంగా మంటలు చెలరేగాయి. షిప్పులోని సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ముహర్రాక్ ద్వీపంపై ఇరాన్ చేసిన దాడితో భారీ మంటలు చెలరేగాయి. జెట్ ఫ్యూయల్ ట్యాంకులు ఉన్న ప్రాంతం కావడంతో ప్రజలంతా కిటికీలు మూసివేసి ఇంట్లోనే ఉండాలని అధికారులు హెచ్చరించారు. కువైట్ లో ఒక నివాస భవనాన్ని ఇరాన్ డ్రోన్ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కువైట్ గగనతలాన్ని ఉల్లంఘించిన మరికొన్ని డ్రోన్లను తమ వైమానిక దళం కూల్చివేసినట్లు కువైట్ రక్షణ శాఖ తెలిపింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని డిప్లొమాటిక్ క్వార్టర్ (రాయబార కార్యాలయాల ప్రాంతం) లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను సౌదీ దళాలు కూల్చివేసాయి. అలాగే తూర్పు ప్రాంతంలోని షైబా చమురు క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకున్న మరికొన్ని డ్రోన్లను కూడా కూల్చివేసినట్లు సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## సెన్సెక్స్, నిఫ్టీ భారీ పతనం

ముంబై: అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో నెలకొన్న తీవ్ర అస్థిరత గురువారం భారత స్టాక్ మార్కెట్లను కుదిపేసింది. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి వెల్లువెత్తింది. దీంతో సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసేసరికి, బీఎస్ఈ సెన్సెక్స్ 829.29 పాయింట్లు క్షీణించి 76,034.42 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 227.70 పాయింట్లు నష్టపోయి 23,639.15 వద్ద ముగిసింది. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలు కూడా మార్కెట్ల పతనానికి కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రితో సముద్ర, ఇంధన భద్రతపై చర్చలు జరిపారు. హోర్ముజ్ జలసంధి గుండా భారత జెండా ఉన్న నౌకలను సురక్షితంగా వెళ్లనిస్తామని ఇరాన్ హామీ ఇచ్చినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈ సెషన్‌లో నిఫ్టీ50 సూచీలో ఆటోమొబైల్ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, మారుతీ సుజుకీ ఇండియా టాప్ లూజర్లుగా నిలిచాయి. గ్యాస్ సరఫరాపై ఆంక్షలు, కొరత ఏర్పడవచ్చన్న భయాలతో నిఫ్టీ ఆటో ఇండెక్స్ అత్యధికంగా పతనమైంది. ఎఫ్ఎంసీజీ, రియాల్టీ సూచీలు కూడా నష్టపోయాయి. అయితే, ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ లాభపడిన ఏకైక రంగంగా నిలిచింది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.69 శాతం మేర క్షీణించాయి. సాంకేతికంగా నిఫ్టీకి 23,500 వద్ద బలమైన మద్దతు ఉందని, 23,700 వద్ద నిరోధం ఎదురుకావచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే చారిత్రక కనిష్ఠానికి పడిపోయిన రూపాయి, ఆర్‌బీఐ చర్యలతో స్వల్పంగా కోలుకుంది.

## పైలట్ల డ్యూటీ టైం పెంచండి

**డీజీసీఏకు ఎయిరిండియా వినతి**




న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా విమానయాన సంస్థలు తమ మార్గాలను మార్చుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా... పైలట్ల విమాన విధి నిర్వహణ సమయ పరిమితి నిబంధనల నుంచి తాత్కాలికంగా సడలింపు ఇవ్వాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ను ఆశ్రయించింది. కొన్ని సుదూర మార్గాల విమానాలకు ముగ్గురు పైలట్లకు బదులుగా ఇద్దరితోనే నడపడానికి, అలాగే గరిష్ఠ ప్రయాణ సమయాన్ని పెంచడానికి అనుమతి ఇవ్వాలని ఎయిర్ ఇండియా కోరింది. ప్రస్తుతం ఉన్న 10 గంటల గరిష్ఠ ప్రయాణ సమయాన్ని 1 గంట 3 నిమిషాలు పెంచి, సుమారు 11 నుంచి 11.5 గంటలకు పొడిగించాలని అభ్యర్థించింది. అలాగే, గరిష్ఠ ఫ్లైట్ డ్యూటీ పీరియడ్‌ను 13 గంటల నుంచి 1 గంట 45 నిమిషాలు పెంచి, 14 గంటల 45 నిమిషాలకు చేర్చాలని కోరింది. మధ్యప్రాచ్యంలోని కొన్ని దేశాల గగనతలంలో ఆంక్షలు, భారత విమానాలకు పాకిస్థాన్ గగనతలం మూసివేయడం వంటి కారణాలతో విమానాలు అరేబియా సముద్రం, మధ్య ఆసియా మీదుగా సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణ సమయం, ఇంధన వినియోగం పెరగడమే కాకుండా, సిబ్బంది డ్యూటీ సమయంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే 11 మధ్యప్రాచ్య దేశాల గగనతలాన్ని ప్రమాదకర జోన్లుగా పరిగణిస్తూ, వాటిని వాడొద్దని డీజీసీఏ భారత విమానయాన సంస్థలకు సూచించింది. ఇరాన్, ఇరాక్ గగనతలాన్ని తప్పించడం వల్ల ఎయిర్ ఇండియా పలు సుదూర విమానాల ప్రయాణ సమయం గణనీయంగా పెరిగింది. ఈ కారణంగా గత వారం పలు విమానాలను రద్దు చేసింది. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ప్రతిపాదనను నియంత్రణ సంస్థ పరిశీలిస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే, ఇండిగో వంటి ఇతర విమానయాన సంస్థల నుంచి ఇలాంటి అభ్యర్థనలు ఇంకా రాలేదని అధికారులు తెలిపారు.

వయ్యారి చిత్రం



శ్రేయా చౌదరి



## యువనటుడు సూసైడ్

మలయాళ చిత్ర పరిశ్రమ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఒకప్పుడు బాల నటుడిగా వెలుగువెలిగిన హరి మురళి, 27 ఏళ్ల అతి పిన్న వయసులోనే తనువు చాలించడం కేరళ సినీ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నేడు ఉదయం కేరళలోని పయ్యన్నూర్ సమీపంలోని అన్నూర్‌లో ఉన్న తన నివాసంలో మురళి విగతజీవిగా కనిపించారు. ప్రముఖ రంగస్థల, సినిమా నటుడు కె.ఎ. మురళి (పయ్యన్నూర్ మురళి) కుమారుడైన హరి, చిన్నతనంలోనే తన అద్భుతమైన నటనతో లక్షలాది మంది హృదయాలను గెలుచుకున్నారు. సుమారు 50కి పైగా చిత్రాల్లో బాల నటుడిగా నటించిన ఆయన, ముఖ్యంగా 2004లో వచ్చిన 'రసికన్' సినిమాలో దిలీప్ సరసన పోషించిన పాత్రతో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. ఆ సినిమాలో ఆయన చెప్పిన ముద్దు ముద్దు డైలాగులు, అల్లరి చేష్టలు నేటికీ మలయాళ ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి. ఆ తర్వాత 'అన్నన్ తంబి', 'డాన్', 'మదంపి', 'పట్టణత్తిల్ భూతం' వంటి భారీ చిత్రాల్లో నటించి బాల నటుడిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. నటన రంగం నుండి కొంత విరామం తీసుకున్న తర్వాత, హరి మురళి సినిమా సాంకేతిక విభాగంపై ఆసక్తి పెంచుకుని విజువల్ ఎఫెక్ట్స్ ఆర్టిస్ట్‌గా కెరీర్‌ను మలుచుకున్నారు.

## రష్మిక వార్నింగ్.. 24 గంటల డెడ్‌లైన్



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నాపై ఆమె తల్లి సుమన్ మందన్నాకు సంబంధించిన ఓ పాత ఆడియో క్లిప్ కటి నెట్టింట తెగ వైరలవుతోంది. దీన్ని ఆధారంగా చేసుకుని చాలామంది రష్మిక గురించి, ఆమె కుటుంబం గురించి సోషల్ మీడియాలో అసత్యప్రచారాలు చేస్తున్నారు. ఈ విషయంపై రష్మిక ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఒక మీడియా వర్గం ఎనిమిదేళ్లుగా నాపై అసత్యప్రచారం చేస్తూ, నన్ను టార్గెట్ చేస్తూ వేధిస్తూనే ఉంది. వాళ్ల వ్యూస్, రీచ్ కోసం నేను అనని మాటల్ని కూడా అన్నట్లుగా తప్పుడు కథనాల్ని రాసింది. అది నన్నెంతో బాధపెట్టినా నేను మౌనంగా ఉన్నాను. కానీ గడిచిన 24 గంటల్లో వారు హద్దులు దాటి నాపై తీవ్ర దుష్ప్రచారం చేశారు. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఓ ప్రైవేటు సంభాషణలోని కొంత భాగాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు నా జీవితంలో మార్పు చేసుకున్న పరిణామాల కారణంగా కావాలనే వాటిని వైరల్ చేస్తున్నారు. ఇంకా ఎంతదూరం వెళ్తారు? మీరిలా చేయడం వల్ల నా కుటుంబసభ్యులే కాకుండా నాకు సంబంధం ఉన్న వ్యక్తుల్ని కూడా ఇబ్బందిపెడుతున్నారు. ఇది నా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేకాదు, నా ప్రతిష్టను దిగజార్చడమే అవుతుంది. మేమిద్దరం (రక్షిత్, నేను) ఎవరి జీవితాల్లో వారు బిజీగా ఉన్నాం. అయినా సరే కొందరు కావాలని వివాదం సృష్టిస్తున్నారు, విషాన్ని చిమ్ముతున్నారు. ఎనిమిదేళ్లుగా మీరేం చేసినా మౌనంగా ఉన్నాను. కానీ, ఈరోజు మిగతావారిని కూడా ఇందులోకి లాగుతూ హద్దులు దాటి ప్రవర్తించారు. ఇక నేను సహనంగా ఉండలేను. మీడియా సంస్థలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు వెంటనే తప్పుడు కథనాల్ని తొలగించండి. మీకు 24 గంటలు టైం ఇస్తున్నా.. ఆలోపు వాటిని తొలగించకపోతే రేపటి నుంచి సంబంధిత వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా' అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో రాసుకొచ్చింది. 2016లో కిరిక్ పార్టీ మూవీ షూటింగ్‌లో రష్మిక, రక్షిత్ శెట్టి ప్రేమలో పడ్డారు. ఆ మరుసటి ఏడాది నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. కానీ, ఆ ప్రేమ పట్టాలెక్కకముందే 2018లో ఎవరి దారి వారు చూసుకున్నారు. అయితే ఆ సమయంలో రష్మిక ఎదుర్కొన్న వేధింపుల గురించి ఆమె తల్లి మాట్లాడినట్లుగా ఓ ఆడియో వైరలవుతోంది. దాదాపు ఎనిమిదేళ్ల కిందటి సంభాషణను ఇప్పుడు రష్మిక పెళ్లి జరిగిన సమయంలో బయటపెట్టడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది.

## జననాయగన్ ఓటీటీ డీల్ రద్దు!




కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న మూవీ జన నాయగన్. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్ వినోథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో రిలీజ్ కానుంది. జన నాయగన్ ముందుగా నిర్ణయించిన ప్రకారం జనవరి 9నే ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో నిలిచిపోయింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో జననాయగన్ ఓటీటీ డీల్‌ను రద్దు చేసుకుందన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. 2026 పొంగళ్ కానుకగా ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం సెన్సార్ వివాదంతో వాయిదా పడ్డ విషయం తెలిసిందే. తాజా టాక్ ప్రకారం అమెజాన్ ప్రైం వీడియో జననాయగన్ పోస్ట్ థియాట్రికల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను రూ.120 కోట్లకు దక్కించుకోగా.. ఇప్పుడు మాత్రం ఆ డీల్‌ను రద్దు చేసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జననాయగన్ రిలీజ్‌పై క్లారిటీ లేకుండా పోయింది. సినిమాలో కొన్ని సన్నివేశాలు మతపరమైన బావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని.. ఆర్మీ దళాలను సమస్యాత్మక కోణంలో చూపించారని సీబీఎఫ్‌సీ సెన్సార్ సర్టిఫికెట్‌ను జారీ చేయలేదు. ప్రస్తుతం ఈ మూవీ రివైజింగ్ కమిటీ ముందు ఉంది. రాబోయే రోజుల్లో రివైజింగ్ కమిటీ సినిమా చూడనుందని తెలుస్తోంది.

## ఇంటి పేరు మార్చుకున్న విజయ్ కొడుకు



నటుడు, తమిళ వెట్రి కళగం(టీవీకే) అధినేత కుమారుడు జాసన్ సంజయ్ తన తండ్రి ఇంటి పేరు తొలగించుకున్నాడు. ఇప్పుడు ఈ అంశం తమిళనాట హాట్ టాపిక్‌గా మారింది. రానున్న శాసనసభ విజయ్, సంగీత దంపతులకు జాసన్ సంజయ్, దివ్యషా పిల్లలు ఉన్నారనే విషయం తెలిసిందే. జాసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తున్న సిగ్మా నిర్మాణం చివరి దశకు చేరుకుంది. త్వరలో విడుదల కానుంది. ఈ క్రమంలో ఈ చిత్రం టైటిల్ కార్డులో తన తండ్రి విజయ్ ఇన్షియల్( ఇంటి పేరు)ను తొలగించడంతో పాటూ తన తల్లి పేరు సంగీత ఇన్షియల్ వచ్చే విధంగా ఎస్‌ను చేర్చుకున్నారు. ఇంతకు ముందే తన ఇన్ స్ట్రాగామ్‌లో తండ్రి విజయ్ ఫాలోవర్స్ నుంచి వైదొలిగారు. ఇప్పుడీ ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

## ఉస్తాద్‌కు యూ/ఏ సర్టిఫికెట్

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో పోషిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏదో ఒక అప్‌డేట్ రిలీజ్ చేస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఏ సర్టిఫికెట్‌ను మంజూరు చేసింది. ఉస్తాద్ భగత్ సింగ్ రన్‌టైంపై అఫీషియల్‌గా క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. ఉస్తాద్ భగత్ సింగ్ రన్‌టైం 2 గంటల 33 నిమిషాల 59 సెకన్లు. ఇందులో ఫస్ట్ హాఫ్ రన్ టైం 1 గంట 11 నిమిషాల 30 సెకన్లు కాగా.. సెకండాఫ్ రన్‌టైం 1 గంట 22 నిమిషాల 29సెకన్లు. పవన్ కల్యాణ్, హరీష్ శంకర్ లాంటి పవర్ ఫుల్ కాంబోలో మరో బ్లాక్ బస్టర్ లోడింగ్ అవుతుంది.. అంటూ ఇక సీట్లకు అతుక్కుపోవాల్సిందేనని మేకర్స్ చెప్పకనే చెబుతున్నారు. ఇటీవలే ఉస్తాద్ భగత్ సింగ్ కోసం డబ్బింగ్ మొదలు పెట్టిన పవన్ కల్యాణ్ స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న స్టిల్‌ను మేకర్స్ సోషల్ మీడియాలో షేర్ చేశారని తెలిసిందే. పవన్ కల్యాణ్‌తోపాటు డైరెక్టర్ హరీష్ శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ స్టిల్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి.గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.



## బాలీవుడ్ ఓ చెత్త



కోలీవుడ్ మూవీతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి, బాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుని, అటు నుంచి హాలీవుడ్ వెళ్లి అక్కడ స్టార్‌డం దక్కించుకున్న ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ స్టార్‌డంతో టాప్ పొజీషన్‌లో ప్రియాంక చోప్రా కెరీర్ కొనసాగిస్తోంది. అప్పుడప్పుడు ఆమె వ్యక్తిగత విషయాల కారణంగా వార్తల్లో నిలుస్తున్న ప్రియాంక చోప్రా చాలా కాలం తర్వాత ఇండియన్ సినిమాల్లో తిరిగి నటిస్తోంది. ముఖ్యంగా ఈమె మహేష్ బాబు, రాజమౌళి కాంబోలో రూపొందుతున్న 'వారణాసి' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమాతో పాటు మరో రెండు హిందీ సినిమాల్లోనూ ఈమె నటించేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. మరో వైపు హాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లోనూ ఈమె వరుసగా నటిస్తూ బిజీబిజీగా ఉంది. తాజాగా ప్రియాంక చోప్రా ఒక ఇంటర్వ్యూలో బాలీవుడ్ గురించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అవుతున్నాయి. గతంలో కూడా బాలీవుడ్‌లో ఉన్న పరిస్థితుల గురించి ఈమె మాట్లాడుతూ అసహనం వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఏకంగా బాలీవుడ్‌ను చెత్త అంటూ సంబోధించడంతో చర్చనీయాంశం అయింది. బాలీవుడ్ వదిలి హాలీవుడ్‌లో ఎక్కువ ప్రాజెక్టులు చేయడానికి గల కారణం ఏంటి అని ప్రశ్నించిన సమయంలో ఆమె నుంచి వచ్చిన సమాధానం షాకింగ్‌గా ఉంది. బాలీవుడ్ సినిమాలతో స్టార్‌డం దక్కించుకున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు బాలీవుడ్‌ను తీవ్ర స్థాయిలో విమర్శించడంను చాలా మంది తప్పుబడుతున్నారు. ప్రియాంక చోప్రా తీరు కచ్చితంగా హర్షనీయం కాదంటూ ఆమెను విమర్శిస్తున్న వారు చాలా మంది ఉన్నారు.



# ధోనీ X యువరాజ్..

## ఏం జరిగిందంటే: సందీప్ పాటిల్

**టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కెరీర్‌ను మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ నాశనం చేశాడనే ప్రచారానికి మాజీ సెలెక్టర్ సందీప్ పాటిల్ తెరదించాడు. ఏ రోజు కూడా యువరాజ్ సింగ్‌ను జట్టు నుంచి తప్పించాలని ధోనీ కోరలేదని స్పష్టం చేశాడు.**

టీమ్ సెలెక్షన్‌లో ధోనీ జోక్యం కూడా చేసుకోలేదని పేర్కొన్నాడు. అంతేకాకుంగా గంభీర్ తనకున్న విభేదాలు గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. యువరాజ్ సింగ్ తండ్రి యోగ్ రాజ్ సింగ్ తరుచూ.. ధోనీ వల్లే తన కొడుకు కెరీర్ నాశనమైందని ఆరోపిస్తుంటాడు.



తన జీవితంలో ఎప్పటికీ ధోనీని క్షమించనని కూడా యోగ్ రాజ్ సింగ్ ఇటీవల ప్రకటించారు. దాంతో యువీ కెరీర్‌కు ధోనీనే ఎండ్ కార్డ్ వేసాడని సిక్సర్ల సింగ్ ఫ్యాన్స్ భావించారు. కానీ ఈ ఆరోపణల్లో నిజం లేదని అప్పటి చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ తెలిపాడు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. యోగ్‌రాజ్ ఆరోపణల్లో నిజం లేదన్నాడు. 'యువరాజ్ సింగ్‌ను తప్పించాలని ధోనీ ఏ రోజు కూడా అడగలేదు. సెలెక్షన్ కమిటీ సమావేశంలోనైనా.. విదేశీ పర్యటనల సందర్భంగానైనా.. మ్యాచ్‌ల సమంలోనైనా యువరాజ్ సింగ్‌ను జట్టు నుంచి తప్పించమని ధోనీ ఎప్పుడూ అడగలేదు. టీమ్ సెలెక్షన్‌లో ధోనీ ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. జట్టు ఎంపిక విషయంలో సెలెక్షన్ కమిటీపై ధోనీకి పూర్తి నమ్మకం ఉండేది. యోగ్‌రాజ్ ఒక తండ్రిగా కొడుకు పట్ల అభిమానం చూపించడం సహజమే అయినా.. ధోనీని నిందించడం సరికాదు.'అని సందీప్ పాటిల్ స్పష్టం చేశాడు. ఇదే ఇంటర్వ్యూలో ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనకు ఉన్న విభేదాల గురించి కూడా సందీప్ పాటిల్ వెల్లడిచాడు. తాను చీఫ్ సెలెక్టర్‌గా ఉన్నప్పుడే గంభీర్‌ను తప్పించి శిఖర్ ధావన్‌ను జట్టులోకి తీసుకున్నామని తెలిపాడు. ఈ నిర్ణయానికి ముందు గంభీర్ తనతో చాలా సన్నిహితంగా ఉండేవాడని, ఆ తర్వాత మాట్లాడటమే మానేశాడని వెల్లడించాడు. టీవీ కార్యక్రమాల్లో కలిసినా తన ముఖం కూడా చూడకపోయేవాడని, పలకరించినా బదులిచ్చేవాడు కాదని పాటిల్ పేర్కొన్నాడు. గంభీర్ ఏ విషయాన్ని అంత త్వరగా మర్చిపోడని, ఎవర్నీ క్షమించడని పాటిల్ చెప్పుకొచ్చాడు. తనతో మాట్లాడకపోయినా.. గంభీర్‌పై తనకు గౌరవం ఉందని సందీప్ పాటిల్ చెప్పుకొచ్చాడు.



# సన్ రైజర్స్‌లో పాక్ క్రికెటర్

ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సంచలనాలకు తెర తీసింది. ఏకంగా పాకిస్తాన్ స్టార్ క్రికెటర్ తో కాంట్రాక్ట్ ను కుదుర్చుకుంది. దీని విలువ 2.34 కోట్ల రూపాయలు. ఇంకొద్ది రోజుల్లో ఐపీఎల్ ప్రారంభం కాబోతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ యాజమాన్యం పాకిస్తాన్ క్రికెటర్ తో ఒప్పందం కుదుర్చుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ పాకిస్తాన్ క్రికెటర్.. అబ్రార్ అహ్మద్. స్టార్ లెగ్ స్పిన్నర్. అతన్ని



1,90,000 పౌండ్లతో కొనుగోలు చేసింది సన్ రైజర్స్ హైదరాబాద్ మేనేజ్మెంట్. భారత కరెన్సీలో దీని విలువ 2.34 కోట్ల రూపాయలు. ఫ్రాంఛైజీ ఓనర్ కావ్యా మారన్ స్వయంగా అతన్ని జట్టులోకి తీసుకుంది. అతని ట్రాక్ రికార్డును ఆధారంగా చేసుకుని, భారీ మొత్తాన్ని వెచ్చించడానికీ వెనుకాడలేదు. ఈ కాంట్రాక్ట్ ప్రకారం-అబ్రార్ అహ్మద్.. సన్‌రైజర్స్ లీడ్స్ తరఫున ఆడాల్సి ఉంటుంది. ది హండ్రెడ్ లీగ్ టోర్నమెంట్ కోసం అతన్ని జట్టులో వినియోగించుకుంటుంది. హండ్రెడ్ లీగ్స్ కోసం ప్రస్తుతం మెగా వేలం పాట కొనసాగుతోంది. కావ్యా మారన్ స్వయంగా ఇందులో పాల్గొన్నారు. సన్ రైజర్స్ లీడ్స్ హెడ్ కోచ్, ఇతర సపోర్టింగ్ స్టాఫ్ దీనికి హాజరయ్యారు. నిజానికి పాకిస్తాన్ ఆటగాళ్లను ఎవరినీ కూడా ఐపీఎల్ టోర్నమెంట్ కోసం తీసుకోకూడదు. ఈ నిబంధన హండ్రెడ్ లీగ్స్ కు వర్తించదు. అందుకే కావ్యా మారన్ ఎటువంటి భేషజాలకూ పోకుండా అబ్రార్ అహ్మద్ ను జట్టులోకి తీసుకుంది. ప్రపంచ టీ20 లీగ్‌లలో పాక్ ఆటగాళ్లను తీసుకోకూడనే సంప్రదాయానికి ఆమె తెరదించారు. 27 ఏళ్ల లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ పాకిస్థాన్ తరఫున 46 టెస్టులు, 28 వన్డేలు, 52 టీ20లు ఆడాడు. ఇటీవల జరిగిన 2026 టీ20 ప్రపంచ కప్‌లో శ్రీలంకతో జరిగిన చివరి సూపర్ 8 దశ మ్యాచ్‌లో 3 వికెట్లకు 23 పరుగులతో అద్భుత ప్రదర్శన చేశాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్, మేజర్ లీగ్ క్రికెట్ ఆడిన అనుభవం అతనికి ఉంది. యూరప్‌లో టీ20 లీగ్‌లో ఆడటం ఇదే తొలిసారి. అతని భాగస్వామ్యం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆమోదంపై ఆధారపడి ఉంటుంది.

### ఢిల్లీలోని ఫ్రాన్స్ ఎంబసీలో

# అభిషేక్ శర్మ సందడి



టీమిండియా యంగ్ డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఢిల్లీలోని ఫ్రాన్స్ రాయబార కార్యాలయంలో సందడి చేశాడు. ఇటీవల ముగిసిన ఐసీసీ టీ20 వరల్డ్ కప్-2026 టోర్నీలో చారిత్రక విజయం సాధించిన భారత జట్టులో అభిషేక్ కీలక సభ్యుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ రాయబార కార్యాలయం అతడిని ప్రత్యేకంగా ఆహ్వానించింది. వరల్డ్ కప్ గెలిచినందుకు అభిషేక్ శర్మకు, టీమిండియాకు ఫ్రాన్స్ ఎంబసీ అధికారులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ అద్భుతమైన విజయం సాధించిన అభిషేక్‌ను తమ కార్యాలయానికి స్వాగతించడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభిషేక్‌తో కాసేపు ముచ్చటించిన అధికారులు, రాబోయే ఐపీఎల్ సీజన్‌లోనూ అద్భుతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు తమ ఆనందాన్ని పంచుకుంటూ ఫ్రాన్స్ ఎంబసీ తమ అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

## పాక్ జట్టు.. పసికూన జట్టు: అమీర్

బంగ్లాదేశ్‌తో తొలి వన్డేలో ఓడిన పాకిస్థాన్‌పై ఆ జట్టు మాజీ క్రికెటర్ మహమ్మద్ అమీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. రాను రాను పాకిస్థాన్ పసికూన జట్టులా తయారయ్యేలా ఉందని మండిపడ్డాడు. పసికూన బంగ్లాదేశ్‌తో ఓడిపోవడం ఏంటని అసహనం వ్యక్తం చేశాడు. సీనియర్ ఆటగాళ్లను పక్కన పెట్టి యువ ఆటగాళ్లతో జట్టును నడిపించలేరని హెచ్చరించాడు. మూడు వన్డేల సిరీస్ కోసం బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్ బుధవారం జరిగిన తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 114 పరుగులకే కుప్పకూలగా.. బంగ్లాదేశ్ 15.1 ఓవర్లలోనే 115 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఈ ఫలితంపై అసహనం వ్యక్తం చేసిన మహమ్మద్ అమీర్ సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తం చేశాడు. 'పాకిస్థాన్ భవిష్యత్తులో ఏదో ఒకరోజు అసోసియేట్ స్థాయి జట్టుగా మారిపోతుందేమోనని నాకు భయంగా ఉంది. పాకిస్థాన్ ఇప్పుడు బంగ్లాదేశ్‌తో కూడా ఓడిపోతుంది. అందుకే ఫేస్‌బుక్ వేదికగా నా ఆందోళనను పంచుకుంటున్నాను. సీనియర్ ఆటగాళ్లను తప్పించి.. కేవలం యువకులతోనే జట్టును నింపలేరు. జట్టులో సరైన మార్గదర్శకత్వం, అనుభవం ఉండటం చాలా అవసరం. ఇప్పుడున్న యువ ఆటగాళ్లు కేవలం మిడ్-వికెట్ వైపు మాత్రమే షాట్లు ఆడుతున్నారు. బంతి ఆఫ్-స్టంప్ మీద పడినప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలో వారికి తెలియడం లేదు. షామిల్ (హుస్సేన్) మిడ్-వికెట్ షాట్ ఆడబోయే క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆఫ్ సైడ్, మిడ్-ఆఫ్ మీదుగా కూడా పరుగులు చేయవచ్చనే విషయం యువ ఆటగాళ్లు అర్థం చేసుకోవాలి. పాకిస్థాన్ బౌలింగ్ తీరు తీవ్ర నిరాశకు గురి చేసింది. పాక్ బ్యాటర్లు తడబడిన అదే వికెట్‌పై బంగ్లాదేశ్ జట్టు ఈజీగా పరుగులు రాబట్టింది.'అని అమీర్ ఆవేదన వ్యక్తం చేశాడు.



## అరుణాచలంలో టీమిండియా ఆటగాళ్లు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో విజేతగా నిలవడంతో టీమిండియా స్టార్ ప్లేయర్లు వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ మొక్కు తీర్చుకున్నారు. తమిళనాడులోని అరుణాచలేశ్వరుడిని బుధవారం రాత్రి దర్శించుకున్న ఈ తమిళ ఆటగాళ్లు.. 14 కిలోమీటర్లు గిరిప్రదక్షిణ చేసి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. భక్తుల రద్దీ, అభిమానుల తాకిడితో పాటు ఎండ వేడిని దృష్టిలో ఉంచుకుని.. ఈ ఇద్దరు ఆటగాళ్లు బుధవారం అర్థరాత్రి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరిప్రదక్షిణకు ముందు అరుణాచలేశ్వర ఆలయాన్ని సందర్శించి స్వామివారికి.. ఉన్నామలై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎవరికీ తెలియకుండా జాగ్రత్తగా చాలా సాదా సీదాగా గిరి ప్రదక్షిణ చేసినా.. వారిని కొంతమంది అభిమానులు గుర్తించి సెల్ఫీలు తీసుకున్నారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముందు భారత్ గెలవాలని, వ్యక్తిగతంగా తమ ప్రదర్శన బాగుండాలని ఈ ఇద్దరు ఆటగాళ్లు మొక్కుకున్నట్లు సమాచారం. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో వరుణ్ చక్రవర్తి అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. బుమ్రాతో కలిసి భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. మరోవైపు వాషింగ్టన్ సుందర్ ఈ టోర్నీలో ఒకే ఒక్క మ్యాచ్ ఆడి ప్రభావం చూపలేకపోయాడు. అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, నెగటివ్ ఎనర్జీ తొలగిపోతుందని భక్తుల నమ్మకం. భారత ఆటగాళ్లు కూడా గిరి ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

### ముంబైకి ఆడి ఉంటే

# పృథ్వీ షా స్టార్ అయ్యేవాడు!

అండర్ 19 ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌లోకి తారాజువ్వలా దూసుకొచ్చిన పృథ్వీ షా అంతే వేగంగా జట్టుకు దూరమయ్యాడు. టీమిండియా భవిష్యత్తు సారథి అవుతాడని ప్రశంసలు అందుకున్న ఈ ముంబై కుర్రాడు.. ప్రస్తుతం ఐపీఎల్‌లోనూ నిలదొక్కుకోలేకపోతున్నాడు. 'సచిన్ ప్లస్ సెహ్వాగ్ = పృథ్వీ షా'అని కామెంటేటర్ల ప్రశంసలు అందుకున్న ఈ ముంబై కుర్రాడు.. మరో కోహ్లీ అవుతాడని అంతా అనుకున్నారు. కానీ అతని విధి రాతనో లేక దురదృష్టమో కానీ కెరీర్‌ను నిలబెట్టుకోలేకపోయాడు. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో పాటు చెడు స్నేహాలు పృథ్వీ షా కెరీర్‌ను నాశనం చేశాయి. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలంలో అతను అన్‌సోల్డ్‌గా నిలిచాడు. అయితే ఐపీఎల్‌లో పృథ్వీ షా ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి కాకుండా ముంబై ఇండియన్స్‌కు ఆడి ఉంటే స్టార్ క్రికెటర్‌గా ఎదిగేవాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగడం అతను చేసుకున్న దురదృష్టమని కామెంట్ చేస్తున్నారు. పృథ్వీ షాకు ఢిల్లీ క్యాపిటల్స్ అండగా నిలిచినా.. అతనికి మంచి గైడెన్స్ ఇవ్వలేకపోయిందని అభిప్రాయపడుతున్నారు. రూ.20 లక్షల కనీస ధరతో 2018 వేలంలోకి వచ్చిన పృథ్వీ షాను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఢిల్లీతో పాటు ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ పోటీపడటంతో అతని ధర అమాంతం పెరిగిపోయింది.

# ధోనీకి లైన్ క్లియర్

## కేసు కొట్టేసిన బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్




ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందే మహేంద్ర సింగ్ ధోనీకి భారీ ఊరట లభించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతున్నారని అతడిపై వచ్చిన ఫిర్యాదును బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ తోసిపుచ్చారు. దాంతో.. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మరోసారి తన మ్యాజిక్ చూపించేందుకు తాలా సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే నెట్స్‌లో సాధన చేస్తున్న మహీ భాయ్.. కేసు కొట్టివేతతో మరింత జోరు పెంచనున్నాడు. భారత క్రికెట్‌లో వివాదరహితుడుగా పేరొందిన ధోనీపై పరస్పర విరుద్ధ ప్రయోజనాల కేసు అభిమానులకు ఒకింత ఆశ్చర్యం కలిగింది. సీఎస్కే ఆటగాడిగా కొనసాగుతున్న ధోనీ.. ఒక క్రికెట్ అకాడమీ నడుపుతున్నాడు. ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే అకాడమీలో ధోనీ భాగస్వామిగా ఉన్నాడు. అందుకని.. బీసీసీఐ నియమ నిబంధనల ప్రకారం అతడు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతాన్నరని ఫిబ్రవరి 28న ఫిర్యాదు నమోదైంది. ఐపీఎల్ ప్లేయర్‌గా ఉంటూనే అకాడమీని నిర్వహించడం ద్వారా ధోనీ బీసీసీఐ నియమావళిలోని 38(4)(ఏ), 38(4)(పీ)ని ఉల్లంఘించారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అంతేకాదు 2018లో బీసీసీఐ సవరించిన పరస్పర విరుద్ధ ప్రయోజనాల నియమాలు 38(2), 38(5)ల ప్రకారం సీఎస్కే స్టార్.. తాను పొందుతున్న లాభాలను బహిర్గతం చేయలేదు. కాబట్టి ధోనీపై చర్యలు తీసుకోవాలని బీసీసీఐని కోరారు. అయితే.. బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ అరుణ్ మిశ్రా స్పందిస్తూ ధోనీపై చర్యలుండవని తేల్చేశారు. ధోనీ క్రికెట్ అకాడమీ 2017లో రిజిస్టర్ అయిందని.. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన నియమాలను 2018 సెప్టెంబర్‌లో అమలులోకి వచ్చాయని అరుణ్ మిశ్రా వెల్లడించారు.

# ఒకే పిచ్‌పై ప్రాక్టీస్ కుదరదు

## ఐపీఎల్‌లో కొత్త రూల్




ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్ ప్రకటనతో ప్రాక్టీస్ సెషన్‌ల జోరు పెంచిన ఫ్రాంచైజీలకు బీసీసీఐ పెద్ద షాకిచ్చింది. మెగా టోర్నీ చరిత్రలో నెట్స్ ప్రాక్టీస్ కు సంబంధించి కీలక మార్పులు చేసింది. ప్రాక్టీస్ సెషన్ విషయమై.. కొన్ని నిబంధనలతో కూడిన మార్గదర్శకాలను గురువారం బీసీసీఐ వెల్లడించింది. ఇంతకుముందులా ఇరుజట్ల ఆటగాళ్లు ఒకే పిచ్ మీద సాధన చేయడం కుదరదని బీసీసీఐ తేల్చి చెప్పింది. 19వ సీజన్ నుంచే ఈ షరతు వర్తిస్తుందని ఫ్రాంచైజీలకు స్పష్టంగా చెప్పింది. ఐపీఎల్ 19వ సీజన్‌కు కౌంట్‌డైన్ మొదలవ్వడంతో.. ఆటగాళ్లంతా నెట్స్ ప్రాక్టీస్‌కు సిద్ధమవుతున్నారు. తొలి దశలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకటనతో.. విజయంతో టోర్నీని ఆరంభించాలని ఫ్రాంచైజీలు పట్టుదలతో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి ఉత్సాహంపై నీళ్లు చల్లుతూ షరుతులు వర్తిస్తాయని బీసీసీఐ కీలక హెచ్చరిక చేసింది. ఇంతకుముందులా ఒకే పిచ్ మీద రెండు జట్ల ఆటగాళ్లు సాధన చేయడం కుదరని కొత్త నియమాన్ని తీసుకొచ్చింది భారత బోర్డు. 'మ్యాచ్‌కు ముందు ఇరుజట్ల ఆటగాళ్లు నెట్స్ ప్రాక్టీస్ సమయంలో వేర్వేరు పిచ్‌లను ఉపయోగించాలి. ఒకజట్టు సాధన చేస్తున్నప్పుడు.. ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు మైదానంలోకి వస్తే వారికోసం కొత్త నెట్స్‌ను సిద్ధం చేయాలి. మొదటి జట్టు ప్రాక్టీస్ త్వరగా పూర్తైన సరే.. రెండో జట్టు మాత్రం ఆ పిచ్‌ను వాడొద్దు.

**షరతులివీ..**

నెట్స్ ప్రాక్టీస్ కోసం ఇరుజట్లకు వేర్వేరు పిచ్‌లు కేటాయించాలి.
ఫ్లడ్ లైట్స్ వెలుగుల్లో ప్రాక్టీస్ చేయాలనుకుంటే మూడున్నర గంటలకు మించకూడదు.
ప్రధాన వికెట్‌కు దూరంగా ఇరుజట్లు ప్రాక్టీస్ చేయాలి.
హోమ్ గ్రౌండ్‌లో ఆడే ఫ్రాంచైజీ.. ప్రత్యర్థి జట్టుకు అవసమరమైన ప్రాక్టీస్ మ్యాచ్ సామగ్రిని సమకూర్చాలి. ఆటగాళ్ల భద్రత, వారికి వైద్య సేవలు.. వంటివి కూడా చూసుకోవాల్సిన బాధ్యత హోమ్ టీమ్‌దే.


ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 13-3-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# నిప్పుకణిక ప్రతీకారం

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో మార్చి 13, 1940 ఒక మరపురాని రోజు. ఆ రోజు లండన్‌లోని కాక్స్టన్ హాల్ గాల్లో పేలిన తూటాలు కేవలం ఒక వ్యక్తిని చంపడానికి ఉద్దేశించినవి కావు; అవి 21 ఏళ్ల క్రితం అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో చిందిన అమాయకుల రక్తానికి బదులుగా కురిసిన నిప్పుకణికలు. ఆ తూటాలను పేల్చిన చేయి వీర విప్లవకారుడు సర్దార్ ఉద్ధమ్ సింగ్‌ది. 1919 ఏప్రిల్ 13న బైశాఖీ పండుగ నాడు జనరల్ డయ్యర్ సాగించిన మారణ కాండ మానవ చరిత్రలోనే అత్యంత క్రూరమైనది. ఆ సమయంలో పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మైఖేల్ ఓడ్వయ్యర్ ఈ ఘాతుకాన్ని సమర్థించడమే కాకుండా, డయ్యర్‌కు పూర్తి మద్దతు ఇచ్చాడు. ఆ రక్తపాతాన్ని కళ్లారా చూసిన టీనేజ్ బాలుడు ఉద్ధమ్ సింగ్, ఆ రోజే ఒక ప్రతిజ్ఞ చేశాడు: 'ఈ అన్యాయానికి కారణమైన వారిని వదిలిపెట్టను' అని. ప్రతీకారం అనేది ఆవేశం మాత్రమే కాదు, అది ఒక తపస్సు అని ఉద్ధమ్ సింగ్ నిరూపించారు. ఆ నిప్పును గుండెల్లో దాచుకుని ఆఫ్రికా, అమెరికా, యూరప్ వంటి దేశాలు తిరుగుతూ విప్లవకారులను ఏకం చేశారు. మారుపేర్లతో, మారువేషాలతో తిరుగుతూ చివరకు లండన్ చేరుకున్నారు. 21 ఏళ్ల పాటు తన లక్ష్యం కోసం వేచి చూసిన ఆయన ఓపిక అసాధారణం. 1940 మార్చి 13న లండన్‌లోని ఒక సభలో ఓడ్వయ్యర్ ప్రసంగిస్తుండగా, పుస్తకంలో దాచుకున్న తుపాకీతో ఉద్ధమ్ సింగ్ అతడిని కాల్చి చంపారు. అక్కడ నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించకుండా, చిరునవ్వుతో లొంగిపోయి, తన పేరును రామ్ మొహమ్మద్ సింగ్ ఆజాద్ అని ప్రకటించుకున్నారు. ఇది భారతదేశంలోని మత సామరస్యానికి, దేశభక్తికి నిదర్శనం. ఉద్ధమ్ సింగ్ చర్యను కొందరు హింసగా పరిగణించవచ్చు, కానీ అది ఒక జాతి ఆత్మగౌరవ ప్రకటన. బ్రిటిష్ సామ్రాజ్యవాద అహంకారానికి పట్టిన గర్వభంగాన్ని ఆయన తూటాలు చాటిచెప్పాయి. 'నా దేశం కోసం చనిపోవడం కంటే గొప్ప గౌరవం ఏముంది?' అని ఉరికంబం ఎక్కిన ఆ మహావీరుడి త్యాగం, నేటికీ భారతీయ యువతలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటుంది.



## ఈ ఘోర నరబలికి అంతమెప్పుడు..?

పవిత్రగ్రంథాల సూక్తులు మట్టిపాలై
ఎండిన పూలదండల్లా రాలిపోయే...

మతపెద్దల శాంతి మంత్రాలు
అరణ్యరోదనలై గాలిలో కలిసిపోయె...

రెక్కలు విరిగిన శాంతి కపోతాలు
తుఫానులో చిక్కుకున్న పక్షుల్లా తల్లడిల్లే..

శిథిలాల కుప్పల మధ్య జనారణ్యం
వేటగాన్ని చూసి వణికే జింకలగుంపాయె

అరచేతిలో ప్రాణాలు గుండెల్లో వణుకు
నీరులేని చెరువులో చేపలై కొట్టుమిట్టాడే...

చేయని నేరానికి ఏమిటి ఈ నరమేధం
బలిపీఠంపై మూగజీవాల హాహాకారాల్లా...

ఏమిటి ఈ దానవత్వం..?
మనిషిని మింగేస్తున్న మృత్యువులా...

క్రూరత్వపు చిమ్మచీకటి అంతమై
శాంతి కాంతి కిరణాలుదయించే దెన్నడు.?

మానవత్వం మళ్ళీ ప్రాణం పోసుకుని
ఒకే తల్లి కన్నబిడ్డల్లా కలిసే రోజెన్నడు..?

ప్రేమ కరుణ దయ జాలి క్షమ
క్షీర సాగరాలై ఉప్పొంగేదెన్నడు..?

ఎడారిలో ఒయాసిస్సులా
శాంతి ఒప్పందాలు కుదిరేదెన్నడు..?


ఈ రక్తపాతపు భీకర మా"రణ"హోమం
ఆగేదెన్నడు ప్రశాంతత పల్లవించే దెన్నడు.



**పోలయ్య**
కూకట్లపల్లి,
హైదరాబాద్

# సాహిత్యంలో పాఠకుడు.. పరిశీలన

సాహిత్యం మనం ఎలా జీవించాలో బోధిస్తుంది. సాహిత్యం పాఠకులను వివిధ ప్రదేశాలు సందర్శింపజేస్తుంది, పలు ఘట్టాలను అనుభవింపజేస్తుంది, ఎందరినో కలిసేలా, వారు చెప్పేవి వినేలా చేస్తుంది, వాళ్ళ సంతోషాలను, బాధలను అనుభూతి చెందేలా చేస్తుంది. ఒక సాహిత్య విలువ కలిగిన పుస్తకం పాఠకులకు అందించే వివేకాన్ని సంపాదించాలంటే సంవత్సరాలు పడుతుంది.





'భరత మహాముని' అభిప్రాయం ప్రకారం సమ సమ స్థితి లో ఉన్న వ్యక్తి మనసు లో దుఃఖం వలన గాని. సంతోషం వలన గాని సరి అయిన కారణం చేత కలిగియే వ్యధ/తృప్తి ఉత్పన్నం చేసే ప్రాథమిక మనో వ్యాపకమే 'భావం' ఆ భావాన్ని కవిత/ వాస్యం/ కథ/నవల గా మలిచి ప్రపంచానికి అందించేవారు కథకుడు/కవి/ నవలాకారుడు. అయితే వీరు రాసిన రచన ప్రధాన లక్ష్యం 'పాఠకుడి' ని అలరించడమే. భిన్న సంఘటనల్ని వస్తువులు గా స్వీకరించి తమ రచన ని జనరంజకంగా తయారు చేస్తారు ...అయితే అన్ని సార్లు రచయత విజయం సాధించకపోవచ్చు. పాఠకుడి ఆలోచన విధం వేరు గా ఉండవచ్చు. అసలు ఒక రచన ని మొదలు కంటా మొదలుపెట్టి చివరిదాకా చదివించే గుణం ఉన్న రచన నే ఉత్తమమైనది అని చెప్పొచ్చు. ఉత్తమ పాఠకుడు అని ఎవరిని సంబోధించవచ్చు? నేటి బిజీ ప్రపంచంలో, చాలా మందికి చదవడానికి సమయం కేటాయించడం కష్టం. కాబట్టి, ఉత్తమ పాఠకులు దీన్ని ఎలా చేస్తారు? సరే, వారు దానికి ప్రాధాన్యతనిస్తారు. వాస్తవానికి, సగటు పాఠకుడు 20% సమయం ఇతర వినోద రూపాల కంటే పఠనాన్ని మాత్రమే ఎంచుకుంటే, ఉత్తమ పాఠకులు 70% సమయాన్ని చదవడాన్ని ఎంచుకుంటారు. వారు సాధారణంగా రోజుకు 2 నుండి 5 సార్లు మరియు ఒక సమయంలో 30-నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు చేస్తారు. వారు ఎక్కడ చదివారో, ఇంట్లో (93%), బెడ్‌లో (85%) చదవడానికి అత్యంత సాధారణ స్థలం అని మీరు బహుశా ఊహించవచ్చు. లేకపోతే, ఉద్వేగభరితమైన పాఠకులు భోజన విరామ సమయంలో (50%), ప్రయాణంలో (32%), సుదీర్ఘ రైలు లేదా విమాన ప్రయాణాల్లో (73%) లేదా పిల్లలు హోంవర్క్ చేస్తున్నప్పుడు కూడా ఎక్కడైనా చదువుతారు. సాధారణ పాఠకుల కోసం టీవీ ఎక్కడ ఉంటే, అది ఉత్తమ పాఠకుల కోసం అందుబాటులో ఉన్న పుస్తకం.

ఒక పుస్తక పాఠకుడు చనిపోయే ముందు వెయ్యి జీవితాలను గడుపుతాడు, ఎప్పుడూ చదవని మనిషి ఒక్కటే జీవిస్తాడు. వాచకాన్ని ఊరికే చదువుతూ వెళ్ళే పాఠకుడు రచనలోని ఖాళీలను పూరించ లేడు. వాచకాన్ని శోధిస్తూ ఖాళీలను పూరిస్తూ పునర్నిర్మించేవాడు ఉత్తమ పాఠకుడు. అయితే అలా చదివి ఆస్వాదించాలి అంటే పాఠకుడి 'జ్ఞాన' సముపార్జన , కవిత్వం పట్ల అవగాహన/విషయం పరిజ్ఞానం అవసరం . అలా చేయగలిగినప్పుడే పాఠకుడు రచన కి కనెక్ట్ అవుతాడు. కళ మనసు వాస్తవాన్ని గ్రహించేటట్లు చేస్తుంది' అని ఏంగిల్స్ అంటాడు./ ఆ థియరీ ని ప్రకారం అభిప్రాయం/భావం అంగీకరిస్తూనే వాస్తవం దూరం నుంచే కళ మనకి చూపిస్తుంది. కవిత్వం కళ లో కవి నిత్యం జరిగే సంఘటనలు/వాస్తవికత దృక్పథం తో సమస్య కి పరిష్కారం చూపుతాడు. అయితే సమాజపు నవీన పోకడలు సమస్య లని కవిత్వం గా మలచడం లో ఒక్కో కవి ఒక్కొక రకం గా స్పందిస్తాడు. తాను ఎంచుకున్న వస్తువు ని వివిధ అలంకారిక సాధనాలతో కవిత గా మలుస్తాడు అది పాఠకుడి కి చేరేలా చేయగలడం లో సఫలం అవుతాడు కానీ అది పాఠకుడి ని అలరించాలి అంటే అది అర్థం అవ్వాలి. 'అర్థం కానీ ఏ కావ్యం అయినా పక్కన పడేసి ముందుకు వెళ్లిపోయే ' సౌలభ్యం పాఠకుడి కి ఉంది .

ఇక పాఠకుడు కథ/నవల కి త్వరగా కనెక్ట్ అయినంత గా కవిత్వానికి కనెక్ట్ కాలేకపోవడానికి గల కారణాలు ఏమిటి ? చాలావరకు కవిత్వపు పరిభాష తెలియకపోవడం మొదటి కారణం అయితే, రెండవ కారణం సంక్లిష్టత కావొచ్చు. పాఠకుడు దేని వైపు ఉండాలి అనేది వ్యక్తిగత ఎంపిక కవిత్వపు రకాలు, లోకం అంతా తెలిసిన ముఖ్యమైన వాటిలో అభ్యుదయ/విప్లవ కవిత్వం, భావ కవిత్వం, కాల్పనిక కవిత్వం. ఇవి కాక ఇంకా చాలా వాదాలు ఉన్నాయి. ప్రాచీనం నుంచి కూడా పద్య/గద్య కవిత్వానికి దగ్గర కావాలి అంటే ఖచ్చితంగా వాటి పై అవగాహన కావాలి, ఇంకా పాఠకుడు సాధన చెయ్యాలి అప్పుడు కానీ కవిత్వాన్ని అర్థం చేసుకోలేడు. ఇది ఎప్పటి దాకా అంటే ఇరవై శతాబ్దపు మొదటి రోజుల వరకు అని చెప్పొచ్చు. శిష్టా, శ్రీశ్రీ,నారాయణ బాబు, పఠాభి - మొదట్లో వచన కవితకి ఒక రూపమిచ్చినట్లుగా సాహిత్య విమర్శకులు పేర్కొంటారు. వచన కవిత అనేది పాశ్చాత్య కవితా ప్రభావం వల్లనే వచ్చింది. దీన్ని ఫ్రీ వర్స్ అంటారు. ఫ్రీ - అంటే అన్ని సంకెళ్ళనూ తెంచుకుని, స్వేచ్ఛగా భావాన్ని వెల్లడించే ధోరణి. . కుందుర్తి గారు చేసిన కృషి వలన అప్పటిదాకా వచ్చిన మాత్ర ఛందస్సు/ఇంకా పద్య గద్య ప్రక్రియని వెనక్కి నెట్టి వచన కవిత్వం ముందుకు సాగింది. కొంచం పాతకాలం లోకి వెళ్తే సాధారణ మానవులు లేదు పాఠకుడు కూడా అద్భుతమైన కవిత్వాన్ని ఆస్వాదించారు. అయితే అది కూడా ఒక స్థాయి సాహిత్య పరిచయమున్న పాఠకుడిని మాత్రమే అలరించేవి. మరి సంక్లిష్టత ఉన్న కవిత్వాన్ని మాత్రం కేవలం కవితా పరిభాష తెలిసిన వాళ్ళు మాత్రమే ఆస్వాదించేవారు. సంక్లిష్టత మూలంగా నే కవిత్వాన్ని సాధారణ పాఠకుడు ఆస్వాదించలేకపోతూ కవిత్వాన్ని దూరం పెడుతున్నాడా? అంటే అవును అనే చెప్పొచ్చు. కందుర్తి ఎప్పుడు కూడా సామాన్య భాష నే వాడాడు.

కుందుర్తి తాను నిర్దేశించిన అభిప్రాయాలకనుగుణంగానే, తన కవిత్వమంతటినీ రాశాడు. ప్రజా సంబంధమైనవస్తువు, ప్రజా సంబంధమైన భావన, భాష, అలంకారం - ఇవన్నీ ఆయన్ని సంపూర్ణ ప్రజాకవిగా మలచినై. ఉదాహరణకి 'నగరంలో వాన' నుండి కొన్ని పంక్తులు 'నగరంలో వాన కవిత్వం నా ఊహాంచలాల్లో కదలాడినట్లు జల్లులు జల్లులై కురుస్తోంది ఆశుకవితతో నగర ప్రజలకు ఆశీస్సులు పలుకుతున్నట్లు'. చూడండి ఎంత సరళత ఉన్నదో .. కుందుర్తి కవిత్వం లో సరళత తో పాటు లోతు వుంది. వైవిధ్యం వస్తురూపాల్లో వుంది. విస్తృతి విషయావగాహనలో, అభివ్యక్త పరిణతిలో వుంది. లోతుభావ సంద్రత- అనుభూతి గాఢతలో వుంది. అన్నీ వెరసి అద్భుత భావాత్మక లయ శిల్పంతో తనదైన శైలిలో కొనసాగుతుంది. వస్తువులో ప్రాకృతిక, వైయుక్తిక, నగర సంక్లిష్టత, ట్రావెలోగ్,ఎలిజీ లాంటివి అనేకం వున్నాయి . అయితే ఇవన్నీ పాఠకుడి ని శ్రమ పెట్టేవి లా ఉండదు ..ఇట్టె తెలిసిపోతాయి సందర్భం ఏమిటి అనేది. ఇక నేటి కవితలకు అందునా సాధారణత కి పెద్ద పీట వేసిన శ్రీ శ్రీ గురించి చెప్పకపోతే అసంపూర్ణమే ..ఎందుకు శ్రీ శ్రీ కవితలు సూటిగా పాఠకుల మనస్సులో కి వెళ్లాయి అంటే సరళత/సామాన్య భాషా/వాడుక పదాలు అని చెప్పొచ్చు.. ఎప్పుడో ఎనభైవ శతకం లో రాసిన కవిత్వం ఇప్పటికి సజీవం గా జనాల్లో ఉంది అంటే కారణం సరళతనే ఇంకొక కవిని పేర్కొనాల్సి వస్తే 'ఆరుద్ర'. ఈయన రాసిన కొన్ని క్లిష్టమైనవి ఉన్నా కూడా 'కూనలమ్మ పదాలు' పేరుతో విశేషమైన పేరు సంపాదించారు. అదే విధంగా, 'మినీ కవిత్వం ' తో అలరించిన తెలంగాణ కవి అలిశెట్టి ప్రభాకర్ ని పేర్కొనవచ్చు. కొద్ది పాదాల్లోనే అద్భుతమైన భావాన్ని వెలువరించి జనాల్లో ముఖ్యం గా పాఠకుల మనసు లో చెరగని ముద్ర వేసిన వీరు ఎప్పటికి గుర్తు ఉంటారు. మరి పాఠకుడు కద కి /నవల కి దగ్గర అయినంత కవిత్వానికి దగ్గర కాలేకపావడానికి కారణం ఈ పఠనీయతనే. కథ పుస్తకాన్ని/నవల ని ఏకబిగిన చదవగలడు కానీ కవిత్వాన్ని చదవడానికి అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. అందునా కవిత్వం సంక్లిష్టత తో కూడుకున్నది అయితే మరీ కష్టం. ప్రతీకవాద కవిత్వం, పద చిత్ర లతో కూడుకున్నవి, ఆబ్స్ట్రాక్ట్ కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి శ్రమ /సమయాన్ని వెచ్చించాలి. ఇప్పటి ఉరుకుల పరుగుల జీవితం లో అంత తీరిక గా పాఠకుడు ఉండగలడా ? అయితే నిజంగా కవిత్వాన్ని ప్రేమించే వారు అర్థం చేసుకోవడనికి యత్నిస్తాడు. ఓ రచయిత పుస్తకాన్ని ఇద్దరు చదివి దాని మీద ఇష్టమేర్పడి దానిని రాసిన వ్యక్తిపై ఇద్దరిలోనూ ఓ అభిమానం ఏర్పడుతుంది. వారెక్కడైనా కలుసుకున్నప్పుడో లేక ఫోన్లో మాట్లాడుకున్నప్పుడో ఆ పుస్తకం గురించి చెప్పుకుంటారు. ఆ ఇద్దరి మధ్య అంతకన్నా మరో సంబంధం లేదు. వారిద్దరినీ కలిపింది ఓ పుస్తకం. అది కవిత్వమా? కథనా ? ఇంకేదైనా సాహిత్య ప్రక్రియ కావొచ్చు. పాఠకుడు ఏ సాహిత్య ప్రక్రియ ని ఎంచుకోవాలి అన్నది అతని ఇష్టం .. అయితే కవిత్వం క్లిష్టమైనది కాబట్టి త్వరగా స్కిప్ చేసి కథ లోకి దూకుతాడు. అసలు పాఠకుడనే వాడు లేకుంటే రచయిత ఎక్కడ ఉంటారు అని ప్రశ్న వేసుకుంటే కొంచం కష్టం అయినా చేదు వాస్తవమే.


రచయతలు/ రచయిత్రులు ఒక్కటి మాత్రం గమనం లో పెట్టుకుంటే చాలా ఎక్కువ గా పాఠక సమూహాన్ని తమ వైపు మళ్ళించుకోవచ్చు. ఒకటి భాషా కి సంబదించిన వాటిని సరళం గా ఉంచడం. ఎంచుకునే వస్తువు వైవిధ్యం గా కాకుండా సాధారణత ని సంతరించుకొని అతి సామాన్య పాఠకుడు కి, సాహిత్యం తో పరిచయం లేనివాడికి కూడా అర్థం అయ్యేలా కవిత్వాన్ని/ కథ /నవల గాని చెప్పి ఒప్పించగలిగేలా ఉండటం. నిజానికి పాఠకుడు రచయతకు కనెక్ట్ అయ్యేది కింది విషయాల్లో రచయత చెప్పి ఒప్పించగలినప్పుడు అది గొప్ప గా వెలుగు చూస్తుంది అదేంటో చూద్దాం ... భాషాకారకాలు, సందర్భం, వక్త, సందేశం, శ్రోత, యానం, మాంద్యం. కవిత్వం రాసే కవి వైయుక్తిక భావమైన, సామాజిక సమస్యల పైనా అయినా కూడా పైన పేరుకున్నవాటిని దృష్టి లో ఉంచుకొని రచన చేస్తే చక్కగా పాఠకుడు కి కనెక్ట్ అవుతాడు ..పదం పదం కలిస్తే భావం. భావాన్ని వాక్యంగా మలచడానికి పదాల అవసరం ఎంతైనా ఉంది అలాంటి పదాలతో ఏర్పడిన వాక్యం నిర్మాణమే కవిత్వం. అలాంటి పదాలు ఎలా ఉండాలో ప్రముఖ పాశ్చాత్య విమర్శకుడు అయిన ఐ ఏ రిచర్డ్ అభిప్రాయం ప్రకారం పదాలకు నాలుగు అర్థాలు ఉంటాయి. అవి అర్థం, అనుభూతి, ధోరణి, ఉద్దేశం. వీటిలో అర్థం నిఘంటుపరమైంది కాగా, అనుభూతి- కోరిక, అభిలాష, సంతోషం నిరాశ మొదలైనవాటి చెందిది. ధోరణి రచయితకు పాఠకుడి పట్ల గల వైఖరి ని చూపిస్తే , ఉద్దేశం రచయత కావాలని గాని , అనుకోకుండా గాని ఆశించిన ప్రయోజనాన్ని తెలుపుతుంది. కవిత్వం లో భాష అనుభూతులిని ప్రభావితం చేస్తుంది అని రిచర్డ్ అభిప్రాయం. అందుకే కవి తాను రాసే కవిత్వం లో పాఠకుడి మనసు ని హత్తుకునే లా అనుభూతుల్ని స్పృశించగలైతే తప్పకుండ విజయం సాధిస్తాడు. పూర్వ కాలపు ప్రముఖ కవుల రచనలు ఇప్పటికి చదవడానికి, చదివించడానికి గల కారణాలు అదే అని చెప్పొచ్చు. ఇక ఇప్పటి కాలానికి వస్తే ఈ కాలం లో కవిత్వం రాసే వాళ్లలో సంక్లిష్టత తో రాసే వాళ్ళు తక్కువ (ప్రతీక వాదం, పద చిత్రాల కవిత్వం) గా ఉన్నా కూడా ఆకట్టుకుంటున్నారు. ఇప్పటి కాలం నవ తరం కవులు ఎక్కువ గా అనుభూతి వాద కవిత్వానికే ప్రాధాన్యత ఇస్తున్నారు . ఎందుకు అంటే కవిత్వం ఒక ఎమోషన్. ఆ ఎమోషన్ ని చక్కగా గా తమ కవితల్లో ఉండేలా చసుకుంటున్నారు.

- పుష్యమీ సాగర్, 7997072896

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.